




స్కై సైక్లింగ్

ఉదయం 9.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో...

కైలాసగిరిపై స్కై సైక్లింగ్, జిప్ లైనర్

- ఒకటే అయితే రూ.300, రెండూ కలిపి రూ.500



జిప్ లైనర్‌పై ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

ఎప్పటి నుంచో ఊరిస్తున్న అడ్వంచర్ స్పోర్ట్స్ కైలాసగిరిపై అందుబాటులోకి వచ్చాయి. జిప్ లైనర్, స్కై సైక్లింగ్ రెండింటినీ బుధవారం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ కలిసి ప్రారంభించి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రణవ్‌గోపాల్, విశ్వనాథన్ ఇద్దరూ జిప్ లైనర్ ఎక్కారు.

ఆర్‌జే అడ్వంచర్స్ సంస్థ మరో భాగస్వామి టీఎంవీతో కలిసి జాయింట్ వెంచర్ కింద పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంలో రూ.2 కోట్లతో వీటిని ఏర్పాటుచేసింది. కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహానికి ఎడమ వైపున వీటిని ఏర్పాటుచేశారు. జిప్‌లైనర్ వెళ్లడానికి ఒక మార్గం, అటు వైపు నుంచి తిరిగి వెనక్కి రావడానికి మరో మార్గం పెట్టారు. అటువైపు పెద్ద టవర్ నిర్మించి, ఇటు నుంచి వెళ్లిన వారిని అక్కడ దించిన తరువాత టవర్‌లో మరికొంత పైకి తీసుకువెళ్లి ఇంకొక మార్గం ద్వారా వెనక్కి పంపుతున్నారు. ఇక స్కై సైక్లింగ్ విషయానికి వస్తే దానికి ఒకటే మార్గం పెట్టారు. ఇటు నుంచి వెళ్లిన తరువాత అక్కడ సైకిల్‌ను ఇటు వైపునకు తిప్పి వచ్చిన చోటకు పంపుతున్నారు. వీటికి ఒక్కో దానికి రూ.300 టిక్కెట్ ధర నిర్ణయించారు. ఈ రెండింటినీ ఉపయోగించుకోవాలనుకుంటే రూ.500 తీసుకుంటారు. ఇవి ఉదయం 9.30 నుంచి రాత్రి ఏడు గంటల వరకు అందుబాటులో ఉంటాయి. ప్రారంభ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేశ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

టమాటా @44

మళ్లీ పెరుగుతున్న ధర

- వారం రోజుల్లో రూ.14 పెరుగుదల
- తగ్గని ఉల్లి ఘాటు...కిలో రూ.56



విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

టమాటా ధర మళ్లీ పెరుగుతోంది. ఇది సీజన్ ప్రారంభ సమయం. అలా చూసుకుంటే ధర దిగి రావాలి. కానీ వారం రోజుల నుంచి క్రమంగా పెరుగుతోంది. రైతుబజార్లలో కిలో టమాటా బుధవారం కిలో రూ.44 చొప్పున విక్రయించారు. ఈ నెల మొదటి వారంలో కిలో రూ.30కే లభించింది. సరకు బాగా రావడంతో రిటైలర్లు ఆటోలో వేసుకొని మూడు కిలోలు వంద రూపాయల చొప్పున విక్రయించారు. ఇదంతా వారం క్రితం మాట. ఇప్పుడు రూ.44కి చేరింది. ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇది రైతుబజార్ రేటు కాగా బయట మార్కెట్‌లో కిలో రూ.60పైనే అమ్ముతున్నారు. పంటకు తెగుళ్ల సోకడంతో దిగుబడి తగ్గిందని, డిమాండ్‌కు సరిపడా నిల్వలు రాకపోవడం వల్ల హోల్‌సేల్ మార్కెట్ మదనపల్లెలోనే రేటు పెరిగిందని చెబుతున్నారు. స్థానిక రైతులు వేసిన పంట కొద్దికొద్దిగా రావడం ఇప్పుడే ప్రారంభమైంది. ఇంకో రెండు వారాలు ఆగితే జిల్లా రైతులు వేసిన ... మిగతా 6వ పేజీలో

రాగూర్ ఫార్మాలో ప్రమాదం

ఒకరి మృతి, మరో తొమ్మిది మందికి అస్వస్థత

- వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- ప్రమాదంపై సీఎం ఆరా...
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



ఎ.అనీల్

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల ఫార్మాసిటీలోని రాగూర్ లేబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. విష వాయువులు లీకవ్వడంతో ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికుడు అమిత్‌భాగ్ (23) మృతిచెందాడు. మరో తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

...వివరాలు మెయిన్‌లో

మహా మేతగాళ్లు

జీవీఎంసీలో విశృంఖలంగా అవినీతి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)లోని పలు విభాగాల్లో అవినీతి పెచ్చుమీరుతోంది. అక్రమార్జనే పరమావధిగా కొంతమంది అధికారులు తమ కిందిస్థాయి సిబ్బంది సహకారంతో అందినకాడికి దోచుకుంటున్నారు. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల్లో అవినీతి మరింత ఎక్కువగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే అభియోగంపై జోన్-2 కమిషనర్ సింహాచలాన్ని ఏసీబీ అధికారులు అరెస్టు చేయగా, అక్రమ నిర్మాణానికి సహకరించారనే ఉద్దేశంతో సుజాతానగర్ వార్డు ప్లానింగ్ సెక్రటరీని కమిషనర్ సస్పెండ్ చేశారు. ఈ రెండు ఉదంతాలతో జీవీఎంసీలో అవినీతిపై మరోసారి చర్చ మొదలైంది.

- టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల్లో మరీ అధికం
- కొందరు అధికారులు, కిందిస్థాయి సిబ్బందిపై తరచూ ఆరోపణలు
- ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టి ఏసీబీకి చిక్కిన జోన్-2 కమిషనర్ సింహాచలం
- అక్రమ నిర్మాణానికి కొమ్ముకాసి సస్పెన్షన్‌కు గురైన టౌన్ ప్లానింగ్ సెక్రటరీ
- కమిషనర్ గట్టిగా దృష్టిసారిస్తే మరింతమంది అక్రమార్కులు గుట్టురట్టు

జీవీఎంసీలో మిగిలిన విభాగాలతో పోల్చితే టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల్లో పనిచేసే వారికి కాసులవర్షం కురుస్తుందనే అభిప్రాయం ఉంది. టౌన్‌ప్లానింగ్ అధికారులు/సిబ్బంది విషయానికి వస్తే...భవన నిర్మాణం జరిగితే చాలు ఏదో ఒక లోపాన్ని పట్టుకుని నిర్మాణదారులను బెదిరించి డబ్బులు గుంజేస్తారనే విమర్శలు ఉన్నాయి. జీవీఎంసీ పరిధిలో ఎవరైనా ఇల్లు లేదా అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టాలంటే ముందుగా ఆ స్థలానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉండడంతోపాటు ఆ స్థలానికి పన్ను బకాయిలు ఉండకుండా చూసుకోవాలి. అలా ఉన్నప్పుడే జీవీఎంసీ గుర్తింపు కలిగిన లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ) ద్వారా సంబంధిత సచివాలయానికి ఆన్‌లైన్‌లో ప్లాన్ దరఖాస్తును పంపించాలి. అక్కడ వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేటరింగ్ సెక్రటరీ దరఖాస్తుకు సంబంధించిన పత్రాలన్నీ సరిగా ఉన్నాయో లేదో అనేది జీవీఎంసీ రెవెన్యూ విభాగం ఇచ్చిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో పరిశీలించాలి. రిమార్కులు రాసి సంబంధిత వార్డు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌కు, అక్కడి నుంచి టీపీఓకి పంపిస్తారు. నిర్మించాలనుకునే భవన విస్తీర్ణం బట్టి ఆ దరఖాస్తును ఏసీపీ, డీసీపీ, సిటీప్లానర్, చీఫ్ సిటీప్లానర్, కమిషనర్ స్థాయికి ... మిగతా 6వ పేజీలో



జోన్-2 కమిషనర్ సింహాచలం

కొనసాగిన ఏసీబీ సోదాలు

- జోనల్ కమిషనర్ సింహాచలానికి సంబంధించిన మరికొన్ని ఆస్తులు గుర్తింపు
- ఎచ్చెర్లలో అర ఎకరా వ్యవసాయ భూమి, శ్రీకాకుళంలో మేనల్లుడి పేరుతో ఫ్లాట్
- నిందితుడికి పదో తేదీ వరకూ రిమాండ్

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-2 కమిషనర్ పొందూరు సింహాచలం నివాసంతోపాటు అతని బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు బుధవారం కూడా కొనసాగాయి. తొలిరోజు రూ.రెండు కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించిన ఏసీబీ అధికారులు...బుధవారం మరికొన్ని డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కొత్తపేటలోని వియ్యంకుని ఇంట్లో సోదాలు జరిపిన ఏసీబీ అధికారులు...ఆ ప్రాంతంలో సింహాచలానికి అర ఎకరా వ్యవసాయ భూమి ఉన్నట్టు గుర్తించారు. అందుకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. దానిని 2003లో సింహాచలం కొనుగోలు చేశారు. అలాగే సింహాచలం తన మేనల్లుడు పేరిట శ్రీకాకుళం పట్టణంలో ఒక ఫ్లాట్‌ను 2013లో కొనుగోలు చేశారు. ఆ ఫ్లాట్‌ను తానే కొనుగోలు చేసినట్టు సింహాచలం అంగీకరించారు. ఆ ఫ్లాట్ నెలవారీ అద్దె ... మిగతా 6వ పేజీలో

పరిష్కారం దిశగా పంచగ్రామాల భూ సమస్య

సింహాచలం దేవస్థానం చైర్మన్ అశోక్‌గజపతిరాజును కలిసిన జిల్లా ఎమ్మెల్యేలు

- ఆ 420 ఎకరాలకు ప్రత్యామ్నాయంగా 620 ఎకరాలు ఇచ్చేందుకు ప్రతిపాదన
- తమ హయాంలో సమస్య పరిష్కారం కావడం సంతోషదాయకమన్న అశోక్‌గజపతిరాజు



విజయనగరంలో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుతో భేటీ అయిన ఎమ్మెల్యేలు

విజయనగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

సింహాచలం దేవస్థానం పరిధిలోని పంచ గ్రామాల్లో నిర్మాణాలు క్రమబద్ధీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. బుధవారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, పి.గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు విజయనగరంలో దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజును కలిశారు. పంచగ్రామాల భూ సమస్యపై ఆయనతో చర్చించారు. సమావేశంలో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు. చర్చల అనంతరం విలేకరులతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సింహాచలం దేవస్థానం పరిధిలో ఉన్న పంచగ్రామాల భూముల విషయంపై అశోక్ గజపతిరాజుతో చర్చించామన్నారు. ఈ గ్రామాల పరిధిలో 420 ఎకరాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని, ఆ భూములకు బదులు దేవస్థానానికి ప్రభుత్వం 620 ఎకరాలు ఇస్తూ... రిజిస్ట్రేషన్ ఖర్చును దేవస్థానం ఖాతాకు జమ చేయనున్నట్టు తెలిపారు. తద్వారా ఆయా గ్రామాల ప్రజలకు ప్రభుత్వం మేలు చేసినట్టు అవుతుం దన్నారు. దేవస్థానం చైర్మన్ అశోక్ సానుకూలంగా స్పందించడంతో సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందన్నారు. సింహాచలం దేవస్థానం బోర్డు చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతి రాజు మాట్లాడుతూ ఈ సమస్య తమ హయాంలో పరిష్కారం అయితే సంతోషదాయకమన్నారు. అయితే భూముల బదలాయింపు, గృహాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా జరగాలన్నారు. అలాగే స్వామి వారి చందనోత్సవానికి అవసరమయ్యే గంధపు వనాలను పెంచాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో గోవులకు తిండి కూడా పెట్టని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు.



రైల్వే శాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్

వాల్తేరు డివిజన్‌ను కొనసాగించండి

- జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి
- ఈలోగా కార్యకలాపాలు ప్రారంభించాలి
- బెంగుళూరుకు డైలీ రైలు, తిరుపతికి వందేభారత్ అవసరం
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తిచేయాలని రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ కోరారు. ఢిల్లీలో బుధవారం మంత్రిని కలిసిన ఆయన అనేక అంశాలపై మాట్లాడారు. జోన్ కార్యాలయ ... మిగతా 6వ పేజీలో

దత్తత కోసం నిరీక్షణ

దంపతుల ఎదురుచూపులు

- అధికారిక దత్తత కోసం వెల్లువలా దరఖాస్తులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 139 పెండింగ్
- ప్రక్రియ ఆలస్యమై ఒక్క ఏడాదిలోనే 200 మంది ఉపసంహరణ
- ప్రత్యామ్నాయ మార్గాల దిశగా ప్రయత్నాలు
- ప్రస్తుతం శిశుగృహాల్లో 15 మంది పిల్లలు... దత్తతకు అర్హులు నలుగురే



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రతి మహిళ జీవితంలో అమ్మతనం గొప్ప అనుభూతి. మాతృత్వానికి నోచుకోని మహిళల సంఖ్య ఇటీవల పెరుగుతుండడంతో వారికి కేంద్ర ప్రభుత్వం అమ్మా అని పిలిపించుకునే అవకాశాన్ని దత్తత ద్వారా కల్పిస్తోంది. ఇందులో భాగంగా అనాధలు, తల్లిదండ్రులు వద్దనుకునే చిన్నారులను బిడ్డలు కావాలనుకునే దంపతులకు కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తోంది. అయితే ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఆశావహులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో పిల్లలను దత్తత తీసుకునేందుకు యత్నిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఇందుకోసం సుమారు 400 మంది దరఖాస్తు చేసుకున్నారు. మూడు, నాలుగేళ్ల ఎదురుచూసినా ఎలాంటి ప్రయోజనం కనిపించకపోవడంతో 200 మంది తమ దరఖాస్తులను ఉపసంహరించుకున్నారు. కాగా అధికారుల వద్ద ప్రస్తుతం 139 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దత్తత ప్రక్రియ జాప్యం కావడం, ఏళ్లగా ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో కొంతమంది కుటుంబసభ్యుల పిల్లలను పెంచుకోవడం, మరికొందరు అధునాతన వైద్య పద్ధతుల్లో మాతృత్వాన్ని పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

దత్తత ప్రక్రియ ఇలా

పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖకు చెందిన సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ ... మిగతా 6వ పేజీలో

30నే సామాజిక పింఛన్లు పంపిణీ

జిల్లాలో 1,61,584 మంది పెన్షన్‌దారులు

- రూ.69,71,66,500 విడుదల
- ఈ నెల తీసుకోని వారికి ఫిబ్రవరిలో అందుకునే అవకాశం



విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

వచ్చే నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో సామాజిక పింఛన్లు ఒకరోజు ముందుగానే అంటే...ఈనెల 30వ తేదీనే పంపిణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి పింఛన్‌దారుల జాబితాతోపాటు సొమ్ములు విడుదల చేశారు. ఈనెల 29వ తేదీన సచివాలయాల సిబ్బందికి పింఛన్ మొత్తం అందజేస్తారు. 30వ తేదీ ఉదయం నుంచే పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లుచేస్తున్నారు.

జిల్లాలో అన్నిరకాల పెన్షన్‌దారులు కలిపి 1,61,584 మంది ఉన్నారు. వీరికి రూ.69,71, 66,500 అందజేస్తారు. నాలుగు గ్రామీణ మండలాల్లో 26,732 మందికి రూ.11,13,86,500, జీవీఎంసీ పరిధిలోని ఏడు జోన్‌లలో 1,34,852 మందికి రూ.58,57,80,500 పంపిణీ చేయనున్నారు. కాగా ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి మూడో తేదీ మధ్య మాత్రమే పింఛన్లు తీసుకోవాలన్న నిబంధనను ప్రభుత్వం సడలించింది. డిసెంబరు మొదటి వారంలో పింఛన్ తీసుకోకపోతే వచ్చే ఏడాది ... మిగతా 6వ పేజీలో

పెళ్లైన నెల రోజులకే అనంత లోకాలకు...

స్టీల్‌ప్లాంటు రహదారిలో రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులు మృతి
- మృతులు మేనమామ, మేనల్లుడు
- అందులో ఒకరికి గత నెల 26న వివాహం



ప్రమాదంలో మృతిచెందిన పవన్‌కుమార్ (కూర్చున్న యువకుడు), రూపేష్ కుమార్ (వెనుక నిల్చున్న యువకుడు)



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

పెళ్లైయిన నెల రోజులకే ఆ యువకుడికి నిండు నూరేళ్లు నిండిపోయాయి. అతనితోపాటు మరొకరు బుధవారం రాత్రి స్టీల్ ప్లాంటు ప్రధాన మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన డబ్బీరు పవన్‌కుమార్ (30) పరవాడ ఫార్మాసిటీలో పనిచేస్తూ కూర్మన్నపాలెం సమీపాన గల శాతవాహన నగర్‌లో నివాసముంటున్నాడు. అతని మేనల్లుడు కొండవలన రూపేష్‌కుమార్ (21) హైదరాబాద్‌లో సీఏ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇద్దరూ కలిసి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంటు ప్రధాన మార్గంలో కణితి వైపు వెళుతుండగా వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురూ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఇదిలావుండగా హైదరాబాద్‌లో చదువుకుంటున్న ... మిగతా 6వ పేజీలో

వరి రైతులకు సూచనలు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ డా.బి. విజయప్రసాద్, ఏఓ కోమలి బుధవారం తాటితూరు, మజ్జివలస గ్రామాల్లో వరి పంటను పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. చేతికి అందివచ్చిన పంటను కోసి కుప్పలుగా పెట్టుకోవాలన్నారు. కోసిన పంటను పొలాల్లో వదిలేస్తే వర్షాలకు తడిచి ఎందుకూ పనికి రాకుండా పోతుందని చెప్పారు. నూర్పులు అయిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రానికి, కాని మిల్లుల వద్దకు గాని తరలించాలని సూచించారు. రైతు సేవా కేంద్రాలకు తరలిస్తే రశీదు తీసుకోవాలని తెలిపారు.

పద్మనాభంలో...

పద్మనాభం రూరల్ :వచ్చే మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు కోయరాదని ఏఓ చలం సూచించారు. బుధవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి తుఫాన్ సమయంలో వరి సంరక్షణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. నూర్పు చేసిన ధాన్యాన్ని తడవకుండా సుక్షిత ప్రాంతంలో భద్రపరుచుకోవాలన్నారు. వరి కుప్పలపై పరదాలు వేసుకోవాలని సూచించారు.

విపత్తుల పట్ల అప్రమత్తం

భీమునిపట్నం,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విశాఖ 1వ బెటాలియన్ డీఎస్పీ నారాయణరావు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతి స్పందన దళం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తుఫాన్లు, వరదలు, భూకంపాలు, భవన ప్రమాదాలు, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ వైకుంఠరావు, పాఠశాల హెచ్ఎం రమణ, పీఆర్‌టీయూ నాయకుడు కనకల సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు శిక్షణ

భీమునిపట్నం,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్‌లో మంగమారిపేట మత్స్యకారులకు తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై విపత్తు ప్రతి స్పందన దళం ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ నిర్వహించారు. సామాజిక వేదికపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్షణ బోట్ల వినియోగం, అత్యవసర సమయంలో అందించాల్సిన సాయం, వస్తు పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పద్మనాభం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ, పారిశుధ్యం మెరుగుకుఎక్కువ నిధులు కేటాయించనున్నట్టు ఎంపీపీ కె. రాంబాబు తెలిపారు. బుధవారం ఆయన కృష్ణాపురం గ్రామంలో భూలోక అమ్మవారి గుడి వద్ద తాగునీటి బోరు పనులను ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొకర లక్ష్మీ భవాని, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మనాయుడు, నారాయణరావు, అప్పలరాజు, శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా సింహాద్రినాథుడి నిత్య కల్యాణం

సింహాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా తీర్చిదిద్ది ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్రోక్త విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహంగా బాల రంగ్ పోటీలు

భీమునిపట్నం,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో జిల్లాస్థాయి నేషనల్ బాలరంగ్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం కోలాటం, థింసా, ఫోక్ డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి మాట్లాడుతూ సాంస్కృతిక వారసత్వాన్ని, జాతీయ ఐక్యతను ప్రోత్సహించేందుకు ఏపీ పాఠశాలల విద్యా సంచాలకులు ఆదేశాలు మేరకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. కాగా స్థానిక పండిట్ నెహ్రూ ప్రాథమిక పాఠశాల బాలికలు థింసా నృత్యంలో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



చిల్డ్రన్ కాంగ్రెస్‌ను ప్రారంభిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకిస్తున్న ప్రముఖులు

బాలలే పర్యావరణ పరిరక్షకులు

» స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్‌లో ప్రముఖులు

సాగర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాలలే రేపటి పర్యావరణ పరిరక్షకులని జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్ పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణ -సర్క్యులర్ ఎకానమీపై గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజిమెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస నిర్వహిస్తున్న 14వ అంతర్జాతీయ సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. సదస్సుకు హాజరైన దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 800 మంది విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పర్యావరణానికి ప్లాస్టిక్ వినియోగమే ముప్పు అన్నారు. నగరంలో 24 లక్షల గృహాల నుంచి రోజూ 1,200 టన్నుల వ్యర్థాలను సేకరిస్తున్నామని,వాటి నుంచి 15 మెగావాట్ల విద్యుదుత్పాదన జరుగుతోందన్నారు. నగరంలో వాయుకాలుష్యం ప్రమాదకర స్థితి లో ఉందని, మురుగు నీటిని పాక్షికంగానే శుద్ధి చేయగలుగుతున్నామన్నారు. వచ్చే ఏడాది అక్టోబరు నాటికి వ్యర్థాల నుంచి మరింత విద్యుదుత్పాదన సాధించడం, శుద్ధిచేసిన మురుగునీటిని మాత్రమే సముద్రంలోకి వదిలేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. వ్యర్థాల శుద్ధికి టన్నుకు రూ.2,400 ఖర్చవుతోందని, దీనిని తగ్గించేందుకు ప్రజా సహకారం అవసరమన్నారు. సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.ఘోష్ మాట్లాడుతూ బాలల ద్వారా పర్యావరణ చైతన్యం తెచ్చేందుకు గత నెలలో దేశంలోని 152 పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించి, రెండు లక్షలమందిని భాగస్వామ్యం చేశామన్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించడాన్ని సర్క్యులర్ ఎకానమీ అంటారని, దీనిపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వైగౌతమ్‌రావు మాట్లాడుతూ అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకునే ప్రణాళికలు అవసరమన్నారు. సదస్సులో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు, నార్వే శాస్త్రవేత్త డాక్టర్ క్రిస్టియన్ జె.ఎంగెల్‌సన్, సదస్సు కన్వీనర్లు ప్రొఫెసర్ సాయిసుధాకర్, డాక్టర్ సౌదామిని తదితరులు పాల్గొన్నారు. చిల్డ్రన్ కాంగ్రెస్‌లో భాగంగా వ్యర్థాల నుంచి తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను విద్యార్థులు ప్రదర్శించారు. బెన్‌సాన్స్, శ్రీచైతన్య, విశాఖవ్యాలీ, నేవీ చిల్డ్ర న్ పాఠశాలలు, సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

జూట్ మిల్లు భూములు పరిశీలన

తగరపువలస, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు ఆధీనంలో ఉన్న భూములను ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి, ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ లాకౌట్ జరిగి 15 ఏళ్లు కావస్తోందని, మిల్లులో ఉన్న భవనాలను యాజమాన్యం కూల్చి కొన్ని స్థలాలు అమ్మకం చేయగా, మరికొన్ని అమ్మకానికి ప్రయత్నిస్తోందన్నారు. కార్మికులకు బకాయిలు చెల్లించకుండా ఆస్తుల అమ్మకం సరికాదని పేర్కొన్నారు. కోర్టు వివాదాల్లో కొన్ని భూములున్నాయని, వాటిని అమ్మే హక్కు లేదని చెప్పారు. యాజమాన్యం ఈ ప్రాంతంలో కొంతమంది అనుయాయుల్ని పెట్టుకుని వ్యవహారాలు సాగిస్తుందని ఆరోపించారు. గత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు కొన్ని బకాయిలు ఇప్పించారని, ప్రస్తుత ఎమ్మెల్యే గంటా కూడా జోక్యం చేసుకుని కార్మికులకు మిగిలిన బకాయిలను ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు నాయకులు చిల్ల రామపైడి, కానూరి రాంబాబు ఉన్నారు.

ఎమ్మెస్సీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

భీమునిపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో స్పాట్ అడ్మిషన్ రిజిస్ట్రేషన్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించలేని వారు కూడా స్పాట్ అడ్మిషన్‌కు అర్హులేనని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

75 మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదనామయ్యపాలెం మండల పరి షత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉచిత వైద్య శిబి రం నిర్వహించారు. 75 మంది విద్యార్థులకు తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యురాలు డా. కల్యాణి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. దివీస్ కంపెనీ సహాయంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ సామాజిక సేవా విభాగం ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన ర్యాలీ

మధురవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన అవసరమని మధురవాడ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యురాలు సుమ తెలిపారు. ప్రధాని పిలుపుమేరకు బుధవారం మధురవాడలో దేశ్‌కా ప్రకృతి అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాల్లో కూడా ఆయుర్వేద వైద్యం గురించి ఉందని, ఎలాంటి దుష్ప్రభావాలు చూపని ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, బెల్లాపు పాపారావు, ఎస్‌వీ రమణ, డాక్టర్ ఎన్. రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లైన నెల రోజులకే అనంత లోకాలకు...

... 5వ పేజీ తరువాయి

రూపేష్‌కుమార్ ఇక్కడకు ఎప్పుడు వచ్చాడో, ఎందుకు వచ్చాడో తెలియదని అతని తల్లి, పవన్‌కుమార్ అక్క సంఘటనా స్థలం వద్ద భోరున విలపించింది. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంటు శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

పెళ్లైన నెల రోజులకే...

ఈ ప్రమాదంలో మృతిచెందిన పవన్‌కుమార్‌కు గత నెల 26న వివాహమైందని అతని అక్క తెలిపింది. కూర్మన్నపాలెం శాతవాహన నగర్ ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడని, మరికొద్దిరోజుల్లో భార్యను ఇక్కడకు తీసుకువచ్చేందుకు చూస్తున్న సమయంలో ఘోరం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది.



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే వెలగపూడి

వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి చర్యలు

విశాలాక్షినగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరి దిగువున ఉన్న వీఎంఆర్‌డీఏ వాకింగ్ ట్రాక్‌ను తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వాకర్స్‌తో మాట్లాడి కల్పించాల్సిన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని అనపర్తి ఎమ్మెల్యే ఎస్. రామకృష్ణారెడ్డి, సినీ నిర్మాత కొర్రపాటి సాయి బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ నక్కాన ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత ఆలయ పండితులు వారికి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కొనసాగిన ఏసీబీ సోదాలు

... 5వ పేజీ తరువాయి

సింహాచలం అకౌంట్‌కే జమ అవుతున్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. రెండు రోజుల సోదాల్లో రూ.2.5 కోట్లు విలువ చేసే ఆస్తులను గుర్తించామని, వాటి మార్కెట్ విలువ రూ.30 కోట్లు వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నట్టు అధికారులు తెలిపారు. సింహాచలాన్ని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా వచ్చే నెల పదో తేదీ వరకూ రిమాండ్ విధించినట్టు డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు తెలిపారు.

దత్తత కోసం నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం కారా (www.cara.nic.in) పేరుతో వెబ్‌సైట్ రూపొందించింది. దత్తత కావాలనుకునేవారు ఇందులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పాన్‌కార్డు వివరాలను నమోదుచేసి లాగిన్ అయిన తరువాత చిరునామాతోపాటు ఐటీ, ఇతర వివరాలను నమోదుచేయాలి. వాటిని పరిశీలించిన తరువాత అధికారులు అర్హులను గుర్తిస్తారు. ఇలా గుర్తించిన వారికి అందుబాటులో ఉన్న చిన్నారులు, ప్రయారిటీ మేరకు దత్తత ఇచ్చే చర్యలు చేపడతారు.

దత్తతకు రెండు కేటగిరీలు

దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు రెండు కేటగిరీల పిల్లలను దత్తత ఇస్తారు. సరండెడ్ (అప్పగించిన), అబాండెడ్ (వదిలేయబడిన) పిల్లలు. కుటుంబ ఆర్థిక స్థితిగతులు సహకరించక పిల్లలను వద్దనుకునేవారు అధికారులకు తమ పిల్లలను సరండర్ చేస్తారు. ఇలా పిల్లలను తీసుకున్న తరువాత అధికారులు తల్లిదండ్రులకు 60 రోజుల సమయం ఇస్తారు. ఈలోగా వారు మనసు మార్చుకుని వస్తే పిల్లలను తిరిగి అప్పగిస్తారు. అప్పటికీ రాకుంటే దత్తతకు అర్హులుగా భావించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇక రెండో కేటగిరీ పిల్లలను కూడా ఇదేవిధంగా దత్తత ఇస్తారు. ఈ పిల్లలకు సంబంధించి పత్రికల్లో ప్రకటనలు ఇస్తారు. వారికి సంబంధించిన వారెవరూ 30 రోజుల్లోగా రాకుంటే బాలల న్యాయ చట్టం ప్రకారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దత్తతకు అర్హులుగా భావించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తుంది. దేశంలో అధికారికంగా దత్తత తీసుకునే ప్రక్రియ 2005లో ప్రారంభమైంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటి వరకూ 159 మందిని దత్తత ఇచ్చారు. ప్రస్తుతం వివిధ శిశుగృహాల్లో 15 మంది చిన్నారులుండగా, ఇందులో నలుగురిని మాత్రమే దత్తత ఇచ్చేందుకు అర్హులుగా గుర్తించారు.

అందరి సహకారంతోనే బాల్య వివాహాల నిర్మూలన



ర్యాలీని ప్రారంభిస్తున్న మేజిస్ట్రేట్ నాగేశ్వరరావు

భీమునిపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతోనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమని భీమిలి ప్రిన్సిపల్ జూనియరు సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ నాగేశ్వరరావు అన్నారు. భీమిలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు బాల్య వివాహాలు ప్రధాన ఆటంకంగా ఉన్నందున వాటి నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని కోరారు.కాగా తహసీల్దార్, ప్రభుత్వాస్పత్రి, మెయిన్ రోడ్, గంట స్తంభం, పాత బస్టాండ్ మీదుగా బీచ్‌రోడ్‌లో వున్న ఫస్ట్ ఏడీఎం కోర్టు వరకూ ర్యాలీ సాగింది. గంట స్తంభం వద్ద మానవహారం నిర్వహించి, పలువురు న్యాయవాదులు, ప్రముఖులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఏడీఎం కోర్టు మేజిస్ట్రేట్ సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ పార్వతీశం, కేఎస్ఎం సుధాకర్,న్యాయవాదులు గౌతమ్, సుందర్ సింగ్, బోని శివ, కనక మహాలక్ష్మీ, అప్పలరాజు, కె. మురళీకృష్ణ, సూరిబాబు, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ లక్ష్మణరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. ప్రమీలా, ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ



పురుషుల విభాగంలో విజేత ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ జట్టు,



విశాఖ ఉమెన్స్ కళాశాల జట్టు

భీమునిపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్ కళాశాలల జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారంతో ముగిసాయి. పురుషుల విభాగంలో ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ జట్టు, మహిళా విభాగంలో విశాఖ ఉమెన్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచాయి. మహిళల విభాగంలో ద్వితీయ స్థానంలో ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ జట్టు, తృతీయ స్థానంలో అనకాపల్లి ఏఎం ఏఎల్ డిగ్రీ కళాశాల జట్టు నిలిచాయి. అలాగే పురుషుల విభాగంలో ద్వితీయ స్థానంలో ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తృతీయ స్థానాన్ని అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెలుచుకున్నాయి. విజేతలకు ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, కళాశాల పూర్వ విద్యార్థి, వాలీబాల్ క్రీడాకారుడు బోర శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు.



ఐటీడీఏ పీఓ అభిషేక్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈడీ రాణిమంద

గిరిజనుల సామాజిక, ఆర్థిక వృద్ధే లక్ష్యం

- అల్లూరి జిల్లా ఐటీడీఏ పీఓ అభిషేక్

సాగర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధే టీసీఆర్ అండ్ టీఎం లక్ష్యమని అల్లూరి జిల్లా ఐటీడీఏ పీఓ అభిషేక్ అన్నారు. బుధవారం ఆయన రుషికొండ గిరిజన భవనం వద్ద జన జాతి గౌరవ దివస్ ముగింపు వేడుకల్లో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గిరిజనులు అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి స్థానం సీతంపేట, రెండవ స్థానం అల్లూరి ఐటీడీఏలు కైవసం చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీసీఆర్ అండ్ టీఎం ఈడీ రాణిమంద, తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు డివిజన్‌ను కొనసాగించండి

... 5వ పేజీ తరువాయి

నిర్మాణానికి చాలా సమయం పడుతుందని, అది పూర్తయ్యేంత వరకూ వేచి చూడకుండా ముందుగానే కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. ఈస్ట్ కోస్ట్, వెస్టర్న్ రైల్వే జోన్లు కూడా ఇలాగే కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. అదేవిధంగా వాల్తేరు రైల్వే డివిజన్‌కు వందేళ్ల చరిత్ర ఉందని, దానిని కొనసాగించాలని కోరారు. ముంబై, కోల్‌కతా నగరాల్లో కూడా రైల్వే డివిజన్లు ఉన్నాయని, ఆ విధంగానే వాల్తేరు డివిజన్‌ను ఉంచాలన్నారు. దానిని విడగొట్టాలనే నిర్ణయంపై పునఃసమీక్ష చేయాలన్నారు. ఇది ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను సంబంధించిన అంశంగా పేర్కొన్నారు. విశాఖ నుంచి ఇతర ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ పెంచాల్సి ఉందన్నారు. విశాఖ నుంచి బెంగళూరు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉందని, ఇందుకు డైలీ సర్వీస్ అందుబాటులోకి తేవాలన్నారు. విశాఖపట్నంలో ఐటీ, పర్యాటక రంగం అభివృద్ధికి బెంగళూరు శాశ్వత రైలు చాలా దోహదపడుతుందన్నారు. విశాఖపట్నం-తిరుపతి నగరాల మధ్య వందేభారత్ సర్వీస్ వేయాలన్నారు. అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్న దువ్వాడ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైళ్లకు అదనపు స్టాప్ కేటాయించాలని కోరారు. దీనివల్ల పరవాడలోని ఫార్మా సిటీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంటు, అచ్యుతాపురం సెజ్ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

టమాటా @44

... 5వ పేజీ తరువాయి

టమాటా అందుబాటులోకి వస్తుందని, అప్పుడు ధర తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

తగ్గని ఉల్లి రేటు...కిలో రూ.56

ఉల్లిపాయల రేటు మార్కెట్‌లో దిగి రావడం లేదు. మూడు నెలలుగా కిలో రూ. 50పైనే అమ్ముతున్నారు. రైతుబజార్లలో బుధవారం నాటి ధర కిలో రూ.56. ఇది షోలాపూర్ నుంచి తెచ్చిన సరకు అని చెబుతున్నారు. కర్నూలు ఉల్లి కిలో రేటు రూ.30 మాత్రమే ఉన్నా దాన్ని వ్యాపారులు తీసుకురావడం లేదు.అది ఇప్పుడే కోతకు వచ్చిన పంట అని, నిల్వ ఉండదని అంటున్నారు. ఏదేమైనా రెండు రకాలు అందుబాటులో ఉంచితే ఎవరికి నచ్చింది వారు కొనుగోలు చేస్తారని, మార్కెటింగ్ శాఖాధికారులు దీనిపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

30నే సామాజిక పింఛన్లు పంపిణీ

... 5వ పేజీ తరువాయి

ఫిబ్రవరి నెల పింఛన్‌తో కలిపి మూడు (డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి) నెలల పింఛన్ ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించింది. వరుసగా మూడు నెలలు తీసుకోకపోతే సదరు పింఛన్‌దారు వలస వెళ్లినట్టుగా పరిగణిస్తారు. అందువల్ల పింఛన్‌దారులు వీలును బట్టి ప్రతినెలా మొదటి వారంలోనే తీసుకోవాలని, అనివార్య కారణాల ఇబ్బంది వస్తే మూడు నెలల పింఛన్ తీసుకునే అవకాశం ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

మహా మేతగాళ్లు

... 5వ పేజీ తరువాయి

వెళుతుంది. అయితే ప్లాన్ దరఖాస్తు వార్డు ప్లానింగ్ సెక్రటరీకి లాగిన్‌కు వెళ్లగానే వసూళ్ల వేట మొదలైపోతుంది. కొంతమంది నిజాయితీగానే పనిచేస్తున్నా ..మరికొందరు మాత్రం బిల్డర్లు, ఎల్‌టీపీలతో ముందుగానే అవగాహన ఏర్పరచుకుని తమ జేబులు నింపుకుంటున్నారు. ఇంకొందరైతే కార్పొరేటర్లతో మిలాఖత్ అయిపోయి వారు చెప్పినట్టు నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పొరేటర్ వద్దంటే ఆ ప్లాన్ దరఖాస్తును పెండింగ్‌లో పెట్టడమో, ఏదో కారణం చూపించి తిరస్కరించడమో చేస్తున్నారు. కార్పొరేటర్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తే మాత్రం తమ వాటా తీసుకుని పైస్థాయి అధికారికి దరఖాస్తును పంపుతున్నారు. వార్డు సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత బిల్డింగ్ ప్లాన్‌ల జారీలో అవినీతి పెరిగిపోవడంతోపాటు అక్రమ నిర్మాణాలు కూడా పెరిగిపోయాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యక్తిగత నివాసానికి ప్లాన్ తీసుకుని ఇరుకురోడ్లలో అపార్టుమెంట్‌లు నిర్మిస్తుండడం, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేయడం, ప్రభుత్వ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి అడ్డదారిలో ప్లాన్ పొందడం వంటివి కళ్లముందే జరుగుతున్నా వార్డు ప్లానింగ్ సెక్రటరీల అటు వైపు కన్నెత్తి చూడరు. ఫిర్యాదులు అందినా చర్యలు లేకుండా కాపాడుతున్నారు. తాజాగా జోన్-8 పరిధిలోని సుజాతనగర్‌లో జీ+2 నిర్మాణానికి ప్లాన్ తీసుకుని అదనంగా మరో మూడు అంతస్థులు నిర్మించేసినా చర్యలు తీసుకోకపోగా, అందుకు పరోక్షంగా సహకరించారనే అభియోగంపై ప్లానింగ్ సెక్రటరీని కమిషనర్ సంపత్‌కుమార్ సస్పెండ్ చేశారు. ప్రతి వార్డులో కమిషనర్ తనిఖీలు చేస్తే మరెంతోమంది ప్లానింగ్ సెక్రటరీలు, టౌన్‌ప్లానింగ్‌లోని దిగువ స్థాయి ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురికావడం ఖాయమని టౌన్‌ప్లానింగ్ అధికారులే అభిప్రాయపడుతుండడం విశేషం. ఇంజనీరింగ్ విభాగంలో కూడా కొంతమంది అధికారులు ఏళ్ల తరబడి తిష్ట వేసుకుని అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ పరిధిలో ఏటా రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులు (సీసీ రోడ్లు, తారురోడ్ల నిర్మాణం, డ్రెయిన్ల రిపేరు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, రంగులు వేయడం, నీటి సరఫరా పైప్‌లైన్‌ల ఏర్పాటు, మరమ్మతులు, నిర్వహణ వంటి పనులు) జరుగుతూనే ఉంటాయి. ఆయా పనులకు అంచనాలు తయారు చేయడంతో మొదలయ్యే అవినీతి టెండర్లు పిలవడం, పనులు పూర్తిచేసిన తర్వాత రికార్డింగ్, బిల్లులు చెల్లింపు వరకూ కొనసాగుతోంది. ఒక పనికి వాస్తవంగా రూ.లక్ష ఖర్చు అయితే ఇంజనీరింగ్ అధికారులు మాత్రం రెట్టింపు మొత్తానికి ప్రతిపాదనలు తయారుచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆయా పనులను అస్మదీయులైన కాంట్రాక్టర్లకు దక్కేలా చేస్తుంటారు. ఒకవేళ వేరే వారు ఎవరైనా పనులు దక్కించుకుంటే ముప్పుతిప్పలు పెట్టి నష్టం వచ్చేలా చేస్తారు. నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు భారీగా అవినీతికి పాల్పడడం ద్వారా రూ.కోట్లు సంపాదించారని ఇంజనీరింగ్ విభాగంలో ప్రచారం జరుగుతోంది. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల పరిస్థితే అలా ఉంటే ఏఈలు, డీఈలు, ఈఈలుగా పనిచేస్తున్న వారి పరిస్థితి ఎలా ఉంటుందనేది ఊహించుకోవాల్సిందే మరి. జీవీఎంసీలో మరో కీలక విభాగంగా చెప్పుకునే రెవెన్యూలో కూడా భారీగానే అవినీతి జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయాల్లో అడ్మిన్‌లు అడ్డదారిలో అసెస్‌మెంట్‌లు జారీచేసి జేబులు నింపుకుంటున్నారనే అభిప్రాయం సర్వతా వ్యక్తమవుతోంది. గతంలో జోన్-8 పరిధిలో ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డిజిటల్ కీని ఉపయోగించి అక్కడ పనిచేసే వార్డు సచివాలయ అడ్మిన్ (డిజిటల్ అసిస్టెంట్) అడ్డగోలుగా 400 వరకూ తప్పుడు అసెస్‌మెంట్‌లు జారీ చేసేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో సంబంధిత ఆర్ఐతోపాటు వార్డు సచివాలయ అడ్మిన్‌ను అప్పటి కమిషనర్ సృజన సస్పెండ్ చేశారు. అదే సమయంలో జోన్-5 పరిధిలో కూడా పెద్దఎత్తున అక్రమ అసెస్‌మెంట్‌లను జారీచేసినట్టు వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో అక్కడ జోనల్ కమిషనర్‌గా తాజాగా ఏసీబీకి పట్టుబడిన జోన్-2 కమిషనర్‌గా పొందూరు సింహాచలం పనిచేస్తున్నారు. అపార్టుమెంట్‌లు, వాణిజ్య భవనాలు నిర్మించే సమయంలో మూడేళ్లకు సంబంధించిన ఖాళీ స్థలం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించకపోతే ప్లాన్ జారీకాదు. అలాంటప్పుడు నిర్మాణదారులు, బిల్డర్లు రెవెన్యూ విభాగంలోని సిబ్బందిని ప్రసన్నం చేసుకుని అక్కడ చాలాకాలంగా షెడ్డు ఉన్నట్టు చూపించి ఒక డోర్ నంబర్ కేటాయించి ఆస్తి పన్ను విధించేస్తున్నారు. దీనివల్ల రూ.లక్షల్లో కట్టాల్సిన వీఎల్‌టీ భారం కేవలం రూ.వందల్లోకి తగ్గిపోతోంది. అలాంటి సందర్భంలో రెవెన్యూ సిబ్బంది భారీగా గుంజుతున్నారు. ఇలాంటి వాటిపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ లోతుగా దృష్టిసారిస్తే అక్రమార్కులకు అడ్డుకట్టపడుతుంది.

☛ సంక్షిప్తంగా..

సివిల్స్ శిక్షణ స్క్రీనింగ్ పరీక్షకు 194 మంది హాజరు

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ కోసం ఉచిత శిక్షణ పొందేందుకు అర్హత పరీక్షను బుధవారం ఎంవీపీ కాలనీలో నిర్వహించారు. బీసీ స్టడీ సర్కిల్ భవనంతో పాటు సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ భవనంలోని మరో హాలులో ఉదయం పద కొండు గంటల నుంచి ఒంటి గంట వరకూ అభ్యర్థులకు పరీక్ష నిర్వహించారు. 240 మంది శిక్షణ కోసం దరఖాస్తు చేయగా 194 మంది హాజరయ్యారని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు.

పీఎం అజయ్ పథకం లబ్ధిదారులకు అవగాహన



సదస్సుల పాల్గొన్న లబ్ధిదారులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ మండలాల్లో ఎంపిక చేసిన 36 మంది స్వయం సహాయక సంఘాలలోని లబ్ధిదారులతో గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ లక్ష్మీపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి బుధవారం పెందుర్తి సమాఖ్య కార్యాలయంలో పీఎం అజయ్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెర్ప్ ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ స్వయం సహాయక సంఘ మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రధానమంత్రి అనుచిత్ జాతి అభ్యుదయ్ యోజన అనే పథకం పేరుతో రూ. 50 వేలు రాయితీతో వడ్డీ లేని రుణం అందిస్తామని లబ్ధిదారులకు వివరించారు. ఈ పథకాన్ని వినియోగించుకోవాలని, తిరిగి సక్రమంగా చెల్లించడం ద్వారా మళ్లీ పెట్టుబడి రుణం పొందే అవకాశం ఉంటుందని అధికారులు లబ్ధిదారులకు వివరించారు.

ప్రొ.సీతారత్నంకు అభినందనలు



సీతారత్నంను అభినందిస్తున్న రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కతర్ దేశ రాజధాని దోహా నగరంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఏయూ కళావేదిక, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంయుక్తంగా నిర్వహించిన తొమ్మిదో ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో ఆచార్య అయ్యగారి సీతారత్నం 'పోతన భాగవతంలో స్త్రీ పాత్రలు' అనే అంశంపై ఆహ్వానిత ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఏయూ రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావు బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఏయూలో గతంలో నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు పత్రాల సంకలనం ప్రవాస సాహిత్యం అనే పుస్తకాన్ని రిజిస్ట్రార్ ఆచార్య అయ్యగారి సీతారత్నంకు అందజేశారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)

● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 56, టమాటా 44, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 35, క్యాబేజీ 36, క్యారెట్ 76 దొండకాయలు 32, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 340 దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 44, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 28, కంద 60, దేముడు చిక్కుడు 62, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

పార్కు నిర్వహణ పట్టించుకోరా!

హెచ్‌బీ కాలనీలోని అబ్దుల్ కలాం పార్కులో ఆవుల సంచారంతో అపరిశుభ్రత



చెత్తాచెదారాలు, ఆవు పేడలతో ఉన్న అబ్దుల్ కలాం పార్కులో ఆట స్థలాలు

వెంకోజీపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పార్కుల అభివృద్ధిని స్థానిక ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రోజూ ఆ పార్కుకు వచ్చే షటిల్ బ్యాడ్మింటన్ ఆటగాళ్లు వేల రూపాయలు ఖర్చు చేసి షటిల్ గ్రౌండ్‌లను తయారు చేసుకున్నారు. అయితే పార్కు అభివృద్ధికి ఎటువంటి ఆలోచన చేయకపోగా ఈ పార్కులో ఆవుల సంచారంతో ఆటగాళ్లు, చిన్నారులు ఎదు ర్కొంటున్న సమస్యలను కూడా పట్టించుకోకపోవడంపై వారంతా ఆవేదన చెందుతున్నారు. ఇదీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కు దుస్థితి.

ఈ పార్కుకు ప్రతి రోజూ ఉదయాన్నే లేచి వ్యాయామం చేసేందుకు పెద్దలు, ఆట విడుపు కోసం షటిల్ క్రీడాకారులు, అలాగే కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు వస్తుంటారు. అయితే వారందరూ పార్కుకు రాగానే ముందుగా ఆవుల పేడలను ఎత్తే కార్యక్రమం చేపట్టాల్సిందే. చిన్నారుల నుంచి పెద్దవారి వరకూ ముందు ఈ ఆవు పేడలను ఎత్తిన తరువాత తమ కార్యకలాపాలను నిర్వర్తించుకునే దుస్థితి నెలకొంది. దీనికి తోడు పార్కు చుట్టు పక్కలున్న వారు తమకేమైనా శుభకార్యాలు ఉంటే ఈ పార్కులో నిర్వహించుకుంటూ, అనంతరం మిగిలిన చెత్తా చెదారాన్ని వదిలి వేయడం వలన ఆటగాళ్లు, చిన్నారులు మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలోనున్న స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ఖాళీ స్థలం, రోడ్లపైన విరివిగా ఆవులను పెంచుతున్నా కనీసం పట్టించుకొని జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులు, పార్కులో వీటి సంచారాన్నైనా అదుపు చేయాలని ఆటగాళ్లు, చిన్నారులు, మహిళలు కోరుతున్నారు.



హెల్త్ ఎరీనాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

హెల్త్ ఎరీనాలో వసతులు మెరుగుపరుస్తాం

» వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అప్పుఘర్ నుంచి ఎంవీపీ కాలనీ మీదుగా హనుమంతవాక వరకూ ఉన్న హెల్త్ ఎరీనాలో వసతులు మెరుగుపరుస్తామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ గోపాల్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ బుధవారం ఈ ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. పాడైనవి తొలగించడం, అవకాశమున్న వాటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. మార్నింగ్ వాక్‌కు వచ్చిన వారితో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

మేధోపర హక్కుల సాధనపై సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మేధోపరమైన హక్కుల సాధనపై ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. 'ఎంపవరింగ్ ఇన్నోవేటర్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్స్' అంశంపై నిర్వహించిన ప్రసంగాలతో విద్యార్థులకు పలు అంశాలపై వక్తలు అవగాహన కలిగించారు. ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఏఐసీటీఈ, నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఐఐసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కృష్ణవేణి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ హిప్సిబారాణీ సింగ్ ఆధ్వర్యంలో ఎన్ఆర్డీసీ సైంటిఫిక్ ఆఫీసర్ సుధా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యూజీ కోర్సుల డైరెక్టర్ డి.గిరిధర్, ప్రిన్సిపాల్ ఆచార్య కేఎస్ బోస్, లైఫ్ సైన్సెస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఇల్లాహి షేక్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ కృషితో రెండున్నరేళ్ల తర్వాత

కుటుంబం చెంతకు వృద్ధుడు



తాతాను మనవడికి అప్పగిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు మురళి

పెదవాల్తేరు, నవంబర్ 27 : ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు ఓ అభాగ్యుడిని తన ఇంటి వారి వద్దకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. మధురవాడకు చెందిన గొలగాని చింతాలు (70) రెండున్నరేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి భార్య కరోనాతో మృతి చెందింది. చింతాలు కుమారుడు పాల్ పలు చోట్ల వెతికినా తండ్రి ఆచూకీ లభించ లేదు. ఈ నేపథ్యంలో తన ఉద్యోగ రీత్యా పాల్ కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లిపోయారు. కొన్నాళ్ల తర్వాత చింతాలు మధురవాడలోని కుమారుడి ఇంటి వద్దకు రాగా, ఇంటి తలుపులు మూసి ఉండడం చూసి స్థానికులకు ఆరా తీశారు. దీంతో కుమారుడు కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లిన విషయం తెలిసింది. ఈ క్రమంలో విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాన్నే కేరాఫ్ అడ్రస్‌గా చేసుకున్నాడు.

ఇదిలావుండగా, జోన్-1లో 2022న రెడ్ క్రాస్ సిబ్బంది రైల్వే స్టేషన్ ప్రాంతంలో రెస్క్యూ చేస్తుండగా చింతాలు ప్లాట్ ఫారంపై నిద్రిస్తూ కనిపించాడు. ఆరా తీసి, అతడిని రెడ్ క్రాస్ షెల్టర్ లెస్ హోంకు తరలించారు. చింతాలు కుడి కన్నుకు సమస్య వచ్చి అంధకారంగా మారడంతో పెదవాల్తేరులోని విశాఖ ఐ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స కూడా చేయించారు. అనంతరం రెడ్ క్రాస్ సిబ్బంది మధురవాడ వెళ్లి చింతాలు కుమారుడి కోసం ఆరా తీయగా, కొద్దిగా దొరికిన సమాచారంతోనే హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉంటున్నట్లు తెలుసుకున్నారు. చివరకు పాల్ అడ్రస్ దొరకడంతో సమాచారం అందజేశారు. చింతాలు మనుమడు క్రాంతి కుమార్ తన స్నేహితుడితో కలిసి విశాఖలోని రెడ్ క్రాస్ షెల్టర్‌కు వచ్చారు. తాతా, మనుమళ్లు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన తాతాను చూసి రెండున్నరేళ్లయిందని, అయన ఆచూకీ దొరకకపోవడంతో చనిపోయాడనుకున్నామని క్రాంతికుమార్ కళ్లలో ఆనంద బాష్పాలు రాలుతుండగా చెప్పాడు. తమ తాతాను తమకు క్షేమంగా అప్పగించినందుకు రెడ్ క్రాస్ సేవలను క్రాంతి కొనియాడారు. ఇన్నాళ్ల తర్వాతైనా చింతాలును వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించడం సంతోషంగా ఉందని పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హోంలెస్ షెల్టర్ మేనేజర్ మురళీ ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదానం



పెదవాల్తేరు, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని బుధవారం పెదవాల్తేరులోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త సీహెచ్ జ్యోతి అధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు.

విమ్స్ ఉద్యోగుల దాతృత్వం

» సహోద్యోగి కుమారుడి వైద్యానికి రూ.1.3 లక్షల వితరణ

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సహోద్యోగి కుమారుడు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతుండగా, తోటి ఉద్యోగులంతా ముందుకు వచ్చి సహాయం అందించడం అభినందనీయమని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పేర్కొన్నారు. 'విమ్స్'ల నర్సుగా పని చేస్తున్న బాలు కుమారుడు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నాడు. అతడి వైద్యం కోసం బాలు దేశంలోని ఎన్నో ఆస్పత్రుల్లో ఫలితం లేకపోయింది. మరోవైపు బాలు ఆర్థికంగా చితికిపోయారు. దీంతో సహచర ఉద్యోగులు కొందరు చొరవ తీసుకొని విమ్స్ సిబ్బంది నుంచి రూ.1.30 లక్షలు సేకరించారు. ఆ మొత్తాన్ని విమ్స్ డైరెక్టర్ రాంబాబు చేతుల మీదుగా బాలుకు అందజేసి తమ గొప్పతనాన్ని చాటుకున్నారు. రాయ్‌వెల్లూరులోని సీఎంసీ వైద్యశాలకు బాలుడిని తీసుకొని వెళుతున్న తరుణంలో తనకు ఈ సహాయం అందించిన అందరికీ బాలు ధన్యవాదాలు తెలిపారు. ఎవరైనా ఆర్థిక సహాయం చేయాలంటూ ఫోన్ నంబరు : 93986 09381లో సంప్రదించాలని ఉద్యోగులు కోరారు.

విద్యార్థులకు నాణ్యతతో ఆహారం అందించాలి : డీవైఈవో



మధ్యాహ్న భోజన వంటలను పరీలిస్తున్న సోమేశ్వరరావు

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలను రుచికరంగా అందించాలని ఉపాధ్యాయులకు జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు సూచించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్ మంగళవారం తోటగరువు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును పర్యవేక్షించిన నేపథ్యంలో డిప్యూటీ డీఈవో ఈ పాఠశాలను బుధవారం సందర్శించారు. పరిసరాలు శుభ్రత, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించే విషయంలో ఎంతమాత్రం నిర్లక్ష్యం తగదన్నారు. ఆయన మధ్యాహ్నం భోజన వంటకాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి మెరుగైన బోధన అందించాలన్నారు. ఈ పర్యటనలో ఎంఈవో-1 రవీంద్రబాబు, ఎంఈవో-2 అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 10వ వార్డులో గల పాత డెయిరీ ఫారానిక సమీపంలో గల ఇందిరా నగర్‌లో నిబంధనలకు విరుదంగా నిర్మాణం చేపట్టిన అంతస్తులను బుధవారం జీవీఎంసీ పట్టణా ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారు. ఓ భవనం నిర్మాణంలో అనుమతులు లేకుండా నిర్మించిన 5, 6 అంతస్తులను ఏసీపీ ఎం.తిరుపతిరావు, టీడీవో బాలరాజు ప్రభాకర్ ఆధ్వర్యంలో తొలగించారు. నగరంలోని ఇలాంటి అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



నిర్మాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

రూ.14 లక్షలతో పక్షుల మోటులు ఆధునికీకరణ



నెమలుల మోటు వద్ద నిర్మిస్తున్న ఫుట్‌పాత్

» జూ క్యూరేటర్ మంగమ్మ

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో గల వివిధ పక్షుల మోటుల వద్ద ఆధునీకరణ పనులు చేపడుతున్నట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సుమారు రూ.14 లక్షల సీఎస్ఆర్ నిధులతో లవ్ బర్డ్స్ మోటు వద్ద మరమ్మతులు చేపడుతున్నట్టు వెల్లడించారు. కొత్తగా పై కప్పులు, గోడలను ఎత్తుగా చేయడం, మరింత వెలుగు ప్రసరించేలా ప్రత్యేంగా గ్లాసులతో ఏర్పాటు వంటి పనులను 12 మోటుల వద్ద చేపడుతున్నట్టు వెల్లడించారు. అలాగే మోటుల ఎత్తు పెంచడం వల్ల సందర్శకుడు వాటిని చూసేందుకు మరింతగా వీలు ఉంటుందన్నారు. అలాగే పక్షులకు ఎలాంటి శబ్దాలు వినిపించకుండా ప్రత్యేక జాగ్రత్తలు వహిస్తున్నట్టు చెప్పారు. నెమలుల మోటు వద్ద సుమారు 12 లక్షలతో క్యాంపు నిధుల నుంచి (జూ ఆదాయం) ఫుట్‌పాత్‌లను నిర్మిస్తున్నట్టు క్యూరేటర్ మంగమ్మ చెప్పారు.



గ్లాస్‌లతో నిర్మాణాలు చేపడుతున్న లవ్ బర్డ్స్ మోటులు

రైతులు, రైతు కూలీల మధ్య సమన్వయం తప్పనిసరి

» ఏయూ పూర్వపు వీసీ నాగేశ్వరరావు

» వర్సిటీలో 'సోషియో ఎకనామిక్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ల్యాండ్లెస్ అగ్రికల్చరల్ లేబరర్స్' సదస్సు



మాట్లాడుతున్న ఏయూ పూర్వపు వీసీ నాగేశ్వరరావు

వెంకోజీపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు, రైతు కూలీల మధ్య సమన్వయం ఎంతో అవసరమని ఏయూ పూర్వ వీసీ జి.నాగేశ్వరరావు అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో బుధవారం నిర్వహించిన 'సోషియో ఎకనామిక్ ఎంపవర్మెంట్ ఆఫ్ ల్యాండ్లెస్ అగ్రికల్చరల్ లేబరర్స్' సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సదస్సును ఏయూ సైకాలజీ విభాగం, ఆగ్రో ఎకనామిక్స్ రీసెర్చ్ సెంటర్, సిఫా ట్రస్టు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆచార్య నాగేశ్వరరావు మాట్లాడుతూ సంతోషమనేది బాహ్య పరిసరాలతో గణించేది కాదని, ఇది పూర్తిగా మనసుకు సంబంధించిందని చెప్పారు. రైతుకూలీల మానసిక సన్నద్ధత, స్థైర్యాన్ని పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ రైతులు, రైతు కూలీల్లో ఆర్థిక, మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని చెప్పారు. సమాజంలో రైతులు, భూమి లేని రైతు కూలీలు కూడా ఎంతో కీలకమన్నారు. వ్యవసాయ రంగం వీరిద్దరిపైనా ఆధారపడి ఉందన్నారు. రైతు కూలీలకు పంటలు పండించే సమయంలో ప్రకృతి సమస్యలు, ధరల్లో స్థిరీకరణ లేకపోవడం ఇబ్బందికరంగా మారుతోందన్నారు. అంతేకాకుండా కుటుంబ సమస్యలు, ఆరోగ్య సమస్యలు వీరికి అదనపు భారంగా మారుతున్నాయని, పర్యవసానంగా కొందరు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారని చెప్పారు. వీరికి నమ్మకం ధైర్యం కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీలో 256 పైగా సైకాలజీ ఉద్యోగాలకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు.

ఆగ్రో ఎకనామిక్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర లిల్లీ గ్రేస్ మాట్లాడుతూ రైతు కూలీలకు సంప్రదాయ, ఆధునిక సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. రైతులు, రైతు కూలీలపై పర్యావరణ మార్పులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. సామాజిక సమరస్తా ఆల్ ఇండియా కన్వీనర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ రైతులు, రైతు కూలీలు వేర్వేరు కాదని అన్నారు. రైతు కూలీలను వేరుగా చూడడం సరికాదని, వీరిద్దరూ కలిసి ముందుకు సాగాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడి వారి ఆలోచనలు అడిగి తెలుసుకున్నారు. సదస్సులో భాగంగా దేశీయ విత్తనాలను ప్రదర్శనలో ఉంచారు. దాదాపు 300 కు పైగా దేశీ జాతుల విత్తనాలను ప్రదర్శించారు. ఈ సదస్సులో విశ్రాంత ఆచార్యులు సి.సాంబమూర్తి, సిఫ డైరెక్టర్ డాక్టర్ శశి ప్రభా, పరిశోధకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చింతలలోవలో మహిళపై వీధి కుక్కల దాడి

» చెవి భాగానికి తీవ్ర గాయం

సింధియా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం చల్లా లక్ష్మి (43) అనే మహిళ చింతలలోవలో గల బంధువుల ఇంటికి వెళ్తుండగా ఒక్కసారిగా పలు కుక్కలు ఆమెపై దాడి చేసి చెవి భాగాన్ని తీవ్రంగా గాయపరిచాయి. కింద పడిపోయిన ఆమె భయంతో పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకోవడంతో శునకాలు పారిపోయాయి. చెవికి తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా గ్రామంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయని పలువురు స్థానికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. లక్ష్మి అనే మహిళ చెవి భాగాన్ని తీవ్రంగా గాయపరిచాయని వివరించారు. అందుకు స్పందించిన ఆయన తక్షణమే వీధి కుక్కల పట్టివేతకు చర్యలు చేపట్టారు. అప్పటికప్పుడు ఎనిమిది శునకాలను సిబ్బంది పట్టుకుని అక్కడ నుంచి తరలించారు.



గాయపడిన మహిళ చెవి భాగం

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల అవగాహన ర్యాలీ



వాహన చోదకులు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోటలోని శ్రీ చైతన్య స్కూలు విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన ర్యాలీనిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి విద్యార్థులు గులాబీలు, చాకెట్లు పంపిణీ చేసి భద్రతా నియమాలు, ప్రమాదాలు గురించి వివరించారు. తొలుత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహనకార్యక్రమంలో ఎంవీపీ పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి కనకరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు విద్యార్థులకు ట్రాఫిక్, భద్రతా నియమాల గురించి తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో పాటు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూలు ప్రిన్సిపాల్ ఎన్వీ రమణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సమాజ సేవ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలగాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ప్రమాదాల నివారణకు సహకరించాలని, సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల నాలుగు జిల్లాల ఏజీఎం ఎంవీ సురేష్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. పాఠశాల సిటీ ప్రాంతీయ ఇంచార్జి అహ్మద్ ఆలీ, డీన్ అప్పలనాయుడు, సి.ఇన్‌చార్జి భూషణ్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ మరియరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా బాధితులకు గండి బాబ్జీ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న గండి బాబ్జీ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పరవాడ ఫార్మా బాధితులను బుధవారం రాత్రి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి బాధితులు త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు.

అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో పాటు స్థానిక నాయకులు గుడివాడ లతీశ్, బొగాది సన్యాసిరావు తదితరులు పరామర్శించారు.

29న జీవీఎంసీ స్టాడింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 29న నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి 117 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు అందజేశారు.

ఈనెల 22న జరగాల్సిన ఈ సమావేశం స్టాండింగ్ కమిటీసభ్యుల కోరం లేకపోవడంతో వాయిదావేశారు. గతవారం జరగాల్సిన సమావేశం కోసం రూపొందించిన అజెండాపైనే తాజా సమావేశంలో చర్చజరుగుతుందని కార్యదర్శి వివరించారు.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అక్కాచెల్లెళ్ల ఎంపిక



ధ్రువీకరణ పత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైస్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ పోటీలకు ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థినులు ఇద్దరు ఎంపికయ్యారు. వీరిద్దరూ అక్కాచెల్లెళ్లు కావడం విశేషం. 2022 బ్యాచ్‌కు చెందిన ఆర్. హేమా హర్షిణి, 2024 బ్యాచ్‌లో ఆర్.దీపికా కీర్తి అక్కాచెల్లెళ్లు. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తరపున సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళల టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబరు 7 నుంచి 10 వరకు కర్ణాటకలోని మణిపాల్ ఎడ్యుకేషన్ అకాడమిలో జరిగే టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఎమ్‌ఎస్‌ఎన్ పాత్రుడు వీరిని అభినందించారు.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ కృషి ప్రశంసనీయం: జేవీ



ప్రదర్శనలో పుస్తకాలు పరిశీలిస్తున్న సీపీఐ నేత జేవీ సత్యనారాయణమూర్తి

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రదర్శన ద్వారా వివిధ రకాల పుస్తకాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్న విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ కృషిని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అభినందించారు. టర్నర్ చౌల్ట్రీలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనను బుధవారం ఆయన సందర్శించారు. విశాలాంధ్ర ఏటా నిర్వహించే పుస్తక ప్రదర్శనలో అరుదైన పుస్తకాలను సైతం సేకరించి ప్రజలకు అందుబాటులో ఉంచుతుంతోందని తెలిపారు. ఆయన వెంట జి.అచ్యుతరావు, అప్పలరాజు, మేనేజర్ రాజు తదితరులు ఉన్నారు.

డీఎల్‌ఎస్‌ఏ సభ్యునికి ఆర్డీవో అభినందన



సత్యనారాయణకు ఎంపిక పత్రం అందజేస్తున్న ఆర్డీవో శ్రీలేఖ

అక్కయ్యపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్‌ఎస్‌ఏ) సభ్యునిగా సాలిగ్రామపురం ప్రాంతానికి చెందిన వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మర్రి సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయనను రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీలేఖ అభినందించారు. విశాఖ జిల్లా నుంచి సత్యనారాయణ ఒక్కరే నియమితులయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా అన్ని ప్రాంతాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించినందుకు హైకోర్టు సమాజ సేవకునిగా గుర్తించి ఈ బాధ్యత అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ హైకోర్టు, జిల్లా కోర్టుకు కట్టుబడి ఉంటానని, ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

'విశ్వబ్రాహ్మణుల కోసం అసెంబ్లీలో మాట్లాడడం హర్షణీయం'

సీతమ్మధార, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమను దేవాలయ బోర్డు సభ్యులుగా నియమించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అసెంబ్లీలో మాట్లాడడంపై విశ్వబ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. విశాఖట్నం జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ తమకు ఏమీ చేయలేదని, ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తాళాబత్తుల రవికిరణ్, మానేపల్లికుమార్, సూర్య ఉన్నారు.

ఉక్కు ఉద్యోగులకు 30 శాతం జీతాలు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు కుటుంబాలతో చేస్తున్న ఆందోళనలకు స్పందించిన యాజమాన్యం బుధవారం మరో 30 శాతం జీతం వారి ఖాతాల్లో జమ చేసింది. అక్టోబరు జీతం ఒకటో తేదీన ఇవ్వాల్సి ఉండగా మొదటి వారంలో 35శాతం ఇచ్చింది. సెప్టెంబరు నెలకు 50శాతం మాత్రమే ఇచ్చింది. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.82 కోట్లు జీతాలకు అవసరం. సెప్టెంబరులో 50 శాతం, అక్టోబరుకు 35శాతం పెండింగ్ పెట్టారు. అంటే ఒక్కొక్కరికి 85శాతం జీతం రావాల్సి ఉంది. మరో మూడు రోజుల్లో నవంబరు ముగుస్తుంది. మళ్లీ జీతాలివ్వాలి. తాజాగా 30 శాతం ఇచ్చినందున నవంబరు జీతం ఎప్పుడు ఇస్తారోనన్న ఆందోళనలో కార్మికవర్గాలు ఉన్నాయి.

రోడ్లు విస్తరించినా ఇరుకే!

- ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాల ప్రభావం
- వన్‌టౌన్‌లో ప్రజలకు తప్పని అవస్థలు



విస్తరణ తర్వాత ఇరుగ్గా మారిన పూర్ణామార్కెట్ రహదారి



ఫుట్‌పాత్ వ్యాపారుల దగ్గర నిలిపిన ద్విచక్ర వాహనాలు

జగదాంబ కూడలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగదాంబ నుంచి వన్‌టౌన్ వరకు రోడ్డు విస్తరణ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా జీవీఎంసీ అధికారులు చేపట్టిన రోడ్డు విస్తరణకు ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచి సవాళ్లు ఎదురవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు, వ్యాపార వర్గాలు తమ స్థలాలు వదులుకొని విస్తరణకు సహకరించడం, ప్రజానీకానికి వీరి ఉదారత ఉపకరిస్తుందని భావించిన అధికార యంత్రాంగం నమ్మకం వమ్మవుతోంది. రోడ్డు విస్తరణ తర్వాత లేపాక్షి జంక్షన్ నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. రోడ్డుపై సగం వరకు ద్విచక్ర వాహనాలు నిలపడం, ఫుట్‌పాత్‌లన్నీ వ్యాపారులు ఆక్రమించడంతో పాదచారులకు యాతన తప్పడం లేదు. జగదాంబ జంక్షన్ లక్కీమాల్ రోడ్డుపైన ఫుట్‌పాత్ స్థలం పూర్తిగా చిరు వ్యాపారుల గుప్పిట్లోకి వెళ్లడంతో రోడ్డు మధ్యలో జనం నడవాల్సిన దుస్థితి నెలకొంది. వాచ్‌హౌస్ లేపాక్షి కుమ్మరవీధి రోడ్డు వైపు పూర్తిగా ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమించి వస్త్రవ్యాపారాలు సాగించడం పట్ల స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాచ్‌హౌస్ లేపాక్షి మార్గం పూర్తిగా వ్యాపారాలతో మూసుకుపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాచ్‌హౌస్ రోడ్డు, దసపల్లా రోడ్డు వైపు యథావిధిగా ఫుట్‌పాత్ వ్యాపారులు రోడ్డు మీదకు రావడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. ఫుట్‌పాత్ వ్యాపారాల వద్దకు కొనుగోలుదారులు ద్విచక్రవాహనాలపై వచ్చి అక్కడే పార్కింగ్ చేస్తుండడంతో రహదారిలో సగం మూసుకుపోతోంది. టర్నర్ చౌల్ట్రీ రోడ్డు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయి. బస్‌స్టాప్ వద్ద బైక్‌లు పార్కింగ్ చేయడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. మెయిన్ ఆంజనేయ స్వామిగుడి రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణలతో నిండిపోయాయి. ట్రాఫిక్ పోలీస్‌లు ఇటువైపు చూసే పరిస్థితి లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పండుగ నేపథ్యంలో మరిన్ని ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొనవలసి వస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మహారాణిపేట, టూటౌన్ ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి తమకు దారి చూపాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డు విస్తరణ తర్వాత కూడా ట్రాఫిక్ సమస్య తలెత్తడం శోచనీయమని అంటున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణ వేడుక

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొల్లలపాలెం ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కార్తీక మాసంలో పాత జైల్‌రోడ్డు జంక్షన్ గొల్లలపాలెంలోని శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు ఈ క్రమంలో బత్తిన వెంకట త్రినాథ్, బత్తిన దంతేశ్వరరావు దంపతులతో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వేడుక నిర్వహించారు అనంతరం సమీప ప్రాంత ప్రజలకు, భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ వేడుకల్లో శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగుల సన్యాసిరావు, కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, శ్రీనివాసరావు

సీతమ్మధార, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేటలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయం దగ్గర పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి రవికుమార్, కూటమి నాయకులు పి.దీపికా అగర్వాల్, పసుపులేటి ఉషాకిరణ్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఈఈ గంగాధర్, డీఈ విజయ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణాపై బహుపరాక్!

- పార్శిల్ సంస్థలకు పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, వేదికపై నార్కోటిక్, పోలీసు అధికారులు

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్శిల్ పంపేందుకు వచ్చిన వ్యక్తి లేదా వ్యక్తుల ప్రవర్తనపై అనుమానం వచ్చినా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు పసిగట్టినా వెంటనే తమకు తెలియజేయాలని పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి కొరియర్ సంస్థలకు సూచించారు. పోలీసు కమిషనరేట్‌లో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో, నగర పోలీసు ఉన్నతాధికారులతో ఈ కామర్స్ ప్రతినిధులు బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు రవాణా అవుతున్న తీరును తెలియజేస్తూ, వాటిని నిరోధించేందుకు చేపట్టవలసిన చర్యలపై పలు పీపీటీల ద్వారా అవగాహన కల్పించారు. కొరియర్ పార్శిళ్లు, ఈ కామర్సు ద్వారా వేరొక ప్రాంతానికి పంపాలనుకున్న పార్శిల్‌లో మాదక ద్రవ్యాలు లేదా చోరీ సొత్తు, బాంబు పేలుళ్లకు ఉపయోగించే పదార్థాలు ఉండవచ్చని, అప్రమత్తంగా ఉంటూ సమాచారాన్ని 7995095799 నెంబరుకు వెంటనే తెలియజేయాలని కమిషనర్ సూచించారు. సమీపంలో ఉన్న డీసీపీ, ఏసీపీ, సీఐలకు అయినా సమాచారం ఇవ్వాలని సూచించారు. తాము నిర్వహించే తనిఖీల్లో ఇలాంటివి దొరికితే కొరియర్ సంస్థలపై కూడా చర్యలు తీసుకోవలసి వస్తుందని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల సరఫరాలో కొరియర్ సిబ్బంది ప్రమేయం బయటపడిందని, ఇకపై నిర్లక్ష్యంగా ఉండకుండా అప్రమత్తం కావాలని సూచించారు. రెడ్‌ఫ్లాగ్ సూచికలను పాటించాలన్నారు. ఎన్‌సీబీ అధికారులు సచిన్‌గోర్పడే, టి.జి. వెంకటేష్, వివిధ స్థాయుల పోలీసు అధికారులు, పార్శిల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దత్తత కోసం నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం కారా (రీరీరీ.ఛ్బిట్బ.జీఛి.జీు) పేరుతో వెబ్‌సైట్ రూపొందించింది. దత్తత కావాలనుకునేవారు ఇందులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పాన్‌కార్డు వివరాలను నమోదుచేసి లాగిన్ అయిన తరువాత చిరునామాతోపాటు ఐటీ, ఇతర వివరాలను నమోదుచేయాలి. వాటిని పరిశీలించిన తరువాత అధికారులు అర్హులను గుర్తిస్తారు. ఇలా గుర్తించిన వారికి అందుబాటులో ఉన్న చిన్నారులు, ప్రయారిటీ మేరకు దత్తత ఇచ్చే చర్యలు చేపడతారు.

దత్తతకు రెండు కేటగిరీలు

దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు రెండు కేటగిరీల పిల్లలను దత్తత ఇస్తారు. సరండెడ్ (అప్పగించిన), అబాండెడ్ (వదిలేయబడిన) పిల్లలు. కుటుంబ ఆర్థిక స్థితిగతులు సహకరించక పిల్లలను వద్దనుకునేవారు అధికారులకు తమ పిల్లలను సరండర్ చేస్తారు. ఇలా పిల్లలను తీసుకున్న తరువాత అధికారులు తల్లిదండ్రులకు 60 రోజుల సమయం ఇస్తారు. ఈలోగా వారు మనసు మార్చుకుని వస్తే పిల్లలను తిరిగి అప్పగిస్తారు. అప్పటికీ రాకుంటే దత్తతకు అర్హులుగా భావించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇక రెండో కేటగిరీ పిల్లలను కూడా ఇదేవిధంగా దత్తత ఇస్తారు. ఈ పిల్లలకు సంబంధించి పత్రికల్లో ప్రకటనలు ఇస్తారు. వారికి సంబంధించిన వారెవరూ 30 రోజుల్లోగా రాకుంటే బాలల న్యాయ చట్టం ప్రకారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దత్తతకు అర్హులుగా భావించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తుంది. దేశంలో అధికారికంగా దత్తత తీసుకునే ప్రక్రియ 2005లో ప్రారంభమైంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటివరకూ 159 మందిని దత్తత ఇచ్చారు. ప్రస్తుతం వివిధ శిశుగృహాల్లో 15 మంది చిన్నారులుండగా, ఇందులో నలుగురిని మాత్రమే దత్తత ఇచ్చేందుకు అర్హులుగా గుర్తించారు.

పెళ్లైన నెల రోజులకే అనంత లోకాలకు...

... 5వ పేజీ తరువాయి

రూపేష్‌కుమార్ ఇక్కడకు ఎప్పుడు వచ్చాడో, ఎందుకు వచ్చాడో తెలియదని అతని తల్లి, పవన్‌కుమార్ అక్క సంఘటనా స్థలం వద్ద భోరున విలపించింది. సమాచారం అందుకున్న స్టీల్ ప్లాంటు శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

పెళ్లైన నెల రోజులకే...

ఈ ప్రమాదంలో మృతిచెందిన పవన్‌కుమార్‌కు గత నెల 26న వివాహమైందని అతని అక్క తెలిపింది. కూర్మన్నపాలెం శాతవాహన నగర్ ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడని, మరి కొద్దిరోజుల్లో భార్యను ఇక్కడకు తీసుకువచ్చేందుకు చూస్తున్న సమయంలో ఘోరం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది.

బాల్య వివాహాల కట్టడిపై చైతన్యం

డాబాగార్డెన్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'బాల్య వివాహాల ముక్తి భారత్' నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు.ర్యాలీని మహిళ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి.జయదేవి, జిల్లా న్యాయసేవా సమితి కార్యదర్శి వెంకట శేషమ్మ ప్రారంభించారు.తదుపరి జగదాంబ సెంటర్ వద్ద అంగన్వాడీ కార్యకర్తలతో మానవహారం చేపట్టారు. బాల్య వివాహాల నిరోధానికి తాముసైతం భాగస్వాములవుతామని ప్రతినబూనారు. మహిళ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓలు శారదాదేవి, రమణీకుమారి, శ్రీలత, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సారూ... సమస్యలు పరిష్కరించరూ!



దొండపర్తిలో ప్రజల సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

దొండపర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దొండపర్తిలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యలలో ప్రధానంగా...శిథిలావస్థలో ఉన్న దొండపర్తి ప్రాంతంలోని నెహ్రూ బజారును కూలగొట్టి కొత్తది నిర్మించడం, శ్రీనగర్ కో-ఆపరేటివ్ కాలనీ దగ్గర రజకులకు ఇళ్ల నిర్మాణం, భగత్ సింగ్‌నగర్‌లో సచివాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించి సామాజిక భవనాన్ని ప్రజోపయోగం మేరకు అందుబాటులోకి తీసుకురావడం, శిథిలావస్థలో ఉన్న మీ సేవా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం, గెడ్డల ఆధునికీకరణ, మండావారి వీధిలోని ప్రభుత్వ పాఠశాలకు మరమ్మతులు, రోడ్డు నిర్మాణం తదితర సమస్యలను ప్రజలు ఏకరవు పెట్టారు. డ్రైనేజీ వ్యవస్థ, సామాజిక భద్రత పింఛన్లు, గృహ నిర్మాణం చేపట్టాలని కోరారు. వారి సమస్యలను ఎమ్మెల్యే వంశీకృష్ణ ఓపిగ్గా విన్నారు. అనంతరం మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తన తదుపరి పర్యటనలో ఈ సమస్యలు మళ్లీ తన దృష్టికి రాకుండా అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, జనసేన అధ్యక్షుడు గుండు సురేష్, బీజేపీ అధ్యక్షుడు మహేష్, కూటమి నాయకులు లక్ష్మీ శివప్రసాద్, పీవీ రమణ, జోనల్ కమిషనర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

డయేరియా బాధిత కుటుంబాలకు పరామర్శ

జగదాంబ కూడలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులను ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశించారు. బుధవారం జబ్బర్ తోట ఏరియాలో డయేరియా బాధిత కుటుంబాలను పరామర్శించి మాట్లాడారు. అక్కడ పారిశుధ్యం, మురుగునీటిపారుదల, తాగునీటి సరఫరా తీరుపై ఆరాతీశారు. బాధితులకు కేజీహెచ్‌లో వైద్యం అందించాలని సూచించారు.

వార్డుల అభివృద్ధిపై దృష్టి

పూర్ణామార్కెట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ పరిధిలో పలు వార్డుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం 35, 39 వార్డుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35వ వార్డు పరిధిలో రూ 35.5 లక్షలతో అయిల్‌మిల్ రోడ్డు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. 39వ వార్డు ఫెర్రి రోడ్డు అభివృద్ధికి రూ.18.5 లక్షలు, పాతపోస్టాఫీసు వద్ద రూ.40 లక్షలతో అదనపు భవన నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహా మేతగాళ్లు

... 5వ పేజీ తరువాయి

వెళుతుంది. అయితే ప్లాన్ దరఖాస్తు వార్డు ప్లానింగ్ సెక్రటరీ లాగిన్‌కు వెళ్లగానే వసూళ్ల వేట మొదలైపోతుంది. కొంతమంది నిజాయితీగానే పనిచేస్తున్నా...మరికొందరు మాత్రం బిల్డర్లు, ఎల్‌టీపీలతో ముందుగానే అవగాహన ఏర్పరచుకుని జేబులు నింపుకుంటున్నారు. కొందరైతే కార్పొరేటర్లతో మిలాఖత్ అయిపోయి వారు చెప్పినట్టు నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పొరేటర్ వద్దంటే ఆ ప్లాన్ దరఖాస్తును పెండింగ్‌లో పెట్టడమో, ఏదో కారణంతో తిరస్కరించడమో చేస్తున్నారు. కార్పొరేటర్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తే మాత్రం తమ వాటా తీసుకుని పైస్థాయి అధికారికి దరఖాస్తును పంపుతున్నారు. వార్డు సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత బిల్డింగ్ ప్లాన్‌ల జారీలో అవినీతి, అక్రమ నిర్మాణాలు పెరిగిపోయాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యక్తిగత నివాసానికి ప్లాన్ తీసుకుని ఇరుకురోడ్లలో అపార్టుమెంట్‌లు నిర్మిస్తుండడం, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేయడం, ప్రభుత్వ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి అడ్డదారిలో ప్లాన్ పొందడం వంటివి కళ్లముందే జరుగుతున్నా వార్డు ప్లానింగ్ సెక్రటరీల అటు వైపు కన్నెత్తి చూడరు. ఫిర్యాదులు అందినా చర్యలు లేకుండా కాపాడుతున్నారు. తాజాగా జోన్-8 పరిధిలోని సుజాతనగర్‌లో జీ+2 నిర్మాణానికి ప్లాన్ తీసుకుని అదనంగా మరో మూడు అంతస్థులు నిర్మించేసినా చర్యలు తీసుకోకపోగా, అందుకు పరోక్షంగా సహకరించారనే అభియోగంపై ప్లానింగ్ సెక్రటరీని కమిషనర్ సంపత్‌కుమార్ సస్పెండ్ చేశారు. ప్రతి వార్డులో కమిషనర్ తనిఖీలు చేస్తే మరెంతో మంది ప్లానింగ్ సెక్రటరీలు, దిగువస్థాయి ఉద్యోగులు సస్పెండవడం ఖాయమని టౌన్‌ప్లానింగ్ అధికారులే చెబుతుండడం విశేషం.

ఇంజనీరింగ్ విభాగంలో కూడా కొంతమంది అధికారులు ఏళ్ల తరబడి తిష్ఠ వేసుకుని అవినీతికి పాల్పడుతున్నారు. జీవీఎంసీ పరిధిలో ఏటా రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులు (సీసీ రోడ్లు, తారురోడ్ల నిర్మాణం, డ్రెయిన్ల రిపేరు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, రంగులు వేయడం, నీటి సరఫరా పైప్‌లైన్‌ల ఏర్పాటు, మరమ్మతులు, నిర్వహణ వంటి పనులు) జరుగుతూనే ఉంటాయి. వీటికి అంచనాలు తయారు చేయడంతో మొదలయ్యే అవినీతి టెండర్లు పిలవడం, పనులు పూర్తిచేసిన తర్వాత రికార్డింగ్, బిల్లులు చెల్లింపు వరకూ కొనసాగుతోంది. ఒక పనికి వాస్తవంగా రూ.లక్ష ఖర్చు అయితే ఇంజనీరింగ్ అధికారులు మాత్రం రెట్టింపు మొత్తానికి ప్రతిపాదనలు తయారుచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆయా పనులను అస్మదీయులైన కాంట్రాక్టర్లకు దక్కేలా చేస్తుంటారు. ఒకవేళ వేరేవారు ఎవరైనా పనులు దక్కించుకుంటే ముప్పుతిప్పలు పెట్టి నష్టం వచ్చేలా చేస్తారు. నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు భారీగా అవినీతికి పాల్పడడం ద్వారా రూ.కోట్లు సంపాదించారని ఇంజనీరింగ్ విభాగంలో ప్రచారం జరుగుతోంది. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల పరిస్థితే అలా ఉంటే ఇంజనీర్ల పరిస్థితి ఎలా ఉంటుందనేది ఊహించాల్సిందే మరి!

జీవీఎంసీలో మరో కీలక విభాగంగా చెప్పుకునే రెవెన్యూలోనూ భారీగానే అవినీతి జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయాల్లో అడ్మిన్‌లు అడ్డదారిలో అసెస్‌మెంట్‌లు జారీచేసి జేబులు నింపుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో జోన్-8 పరిధిలో ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డిజిటల్ కీని ఉపయోగించి అక్కడ పనిచేసే వార్డు సచివాలయ అడ్మిన్ (డిజిటల్ అసిస్టెంట్) అడ్డగోలుగా 400 వరకూ తప్పుడు అసెస్‌మెంట్‌లు జారీ చేసేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఆర్‌ఐ, వార్డు సచివాలయ అడ్మిన్‌ను అప్పటి కమిషనర్ సృజన సస్పెండ్ చేశారు. అదే సమయంలో జోన్-5 పరిధిలోనూ పెద్దఎత్తున అక్రమ అసెస్‌మెంట్‌లను జారీచేసినట్టు వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో అక్కడ జోనల్ కమిషనర్‌గా తాజాగా ఏసీబీకి పట్టుబడిన జోన్-2 కమిషనర్‌గా పొందూరు సింహాచలం పనిచేస్తున్నారు. అపార్టుమెంట్‌లు, వాణిజ్య భవనాలు నిర్మించే సమయంలో మూడేళ్లకు సంబంధించిన ఖాళీ స్థలంకు పన్ను చెల్లించాలి. అలా కాకుంటే ప్లాన్ జారీకాదు. అలాంటప్పుడు నిర్మాణదారులు, బిల్డర్లు రెవెన్యూ విభాగంలోని సిబ్బందిని ప్రసన్నం చేసుకుని అక్కడ చాలాకాలంగా షెడ్డు ఉన్నట్టు చూపించి ఒక డోర్ నంబర్ కేటాయించి ఆస్తి పన్ను విధించేస్తున్నారు. దీనివల్ల రూ.లక్షల్లో కట్టాల్సిన వీఎల్‌టీ భారం కేవలం రూ.వందల్లోకి తగ్గిపోతోంది. అలాంటి సందర్భంలో రెవెన్యూ సిబ్బంది భారీగా గుంజుతున్నారు. ఇలాంటి వాటిపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ లోతుగా దృష్టిసారిస్తే అక్రమార్కులకు అడ్డుకట్టపడుతుంది.

టమాటా రూ.44

5వ పేజీ తరువాయి

టమాటా అందుబాటులోకి వస్తుందని, అప్పుడు ధర తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

తగ్గని ఉల్లి రేటు...కిలో రూ.56

ఉల్లిపాయల రేటు మార్కెట్‌లో దిగి రావడం లేదు. గత మూడు నెలలుగా కిలో రూ.50పైనే అమ్ముతున్నారు. రైతుబజార్లలో బుధవారం నాటి ధర కిలో రూ.56. ఇది షోలాపూర్ నుంచి తెచ్చిన సరకు అని చెబుతున్నారు. కర్నూలు ఉల్లి కిలో రేటు రూ.30 మాత్రమే ఉన్నా దానిని వ్యాపారులు తీసుకురావడం లేదు. అది ఇప్పుడే కోతకు వచ్చిన పంట అని, నిల్వ ఉండదని అంటున్నారు. ఏదేమైనా రెండు రకాలు అందుబాటులో ఉంచితే ఎవరికి నచ్చింది వారు కొనుగోలు చేస్తారని, మార్కెటింగ్ శాఖాధికారులు దీనిపై దృష్టి పెట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

వాల్తేరు డివిజన్‌ను కొనసాగించండి

... 5వ పేజీ తరువాయి

నిర్మాణానికి చాలా సమయం పడుతుందని, అది పూర్తయ్యేంత వరకూ వేచి చూడకుండా ముందుగానే కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. ఈస్ట్ కోస్ట్, వెస్టర్న్ రైల్వే జోన్లు కూడా ఇలాగే కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. అదేవిధంగా వాల్తేరు రైల్వే డివిజన్‌కు వందేళ్ల చరిత్ర ఉందని, దానిని కొనసాగించాలని కోరారు. ముంబై, కోల్‌కతా నగరాల్లో కూడా రైల్వే డివిజన్లు ఉన్నాయని, ఆ విధంగానే వాల్తేరు డివిజన్‌ను ఉంచాలన్నారు. దానిని విడగొట్టాలనే నిర్ణయంపై పునఃసమీక్ష చేయాలన్నారు. ఇది ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను సంబంధించిన అంశంగా పేర్కొన్నారు.

విశాఖ నుంచి ఇతర ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ పెంచాల్సి ఉందన్నారు. విశాఖ నుంచి బెంగళూరు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉందని, ఇందుకు డైలీ సర్వీస్ అందుబాటులోకి తేవాలన్నారు. విశాఖపట్నంలో ఐటీ, పర్యాటక రంగం అభివృద్ధికి బెంగళూరు శాశ్వత రైలు చాలా దోహదపడుతుందన్నారు. విశాఖపట్నం-తిరుపతి నగరాల మధ్య వందేభారత్ సర్వీస్ వేయాలన్నారు. అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్న దువ్వాడ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైళ్లకు అదనపు స్టాప్ కేటాయించాలని కోరారు. దీనివల్ల పరవాడలోని ఫార్మా సిటీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంటు, అచ్యుతాపురం సెజ్ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

30నే సామాజిక పింఛన్ల పంపిణీ

... 5వ పేజీ తరువాయి

ఫిబ్రవరి నెల పింఛన్‌తో కలిపి మూడు (డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి) నెలల పింఛన్ ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించింది. వరుసగా మూడు నెలలు తీసుకోకపోతే సదరు పింఛన్‌దారు వలస వెళ్లినట్టుగా పరిగణిస్తారు. అందువల్ల పింఛన్‌దారులు వీలును బట్టి ప్రతినెలా మొదటి వారంలోనే తీసుకోవాలని, అనివార్య కారణాల ఇబ్బంది వస్తే మూడు నెలల వరకూ పింఛన్ తీసుకునే అవకాశం ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

కొనసాగిన ఏసీబీ సోదాలు

... 5వ పేజీ తరువాయి

సింహాచలం అకౌంట్‌కే జమ అవుతున్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. రెండు రోజుల సోదాల్లో రూ.2.5 కోట్లు విలువ చేసే ఆస్తులను గుర్తించామని, వాటి మార్కెట్ విలువ రూ.30 కోట్లు వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నట్టు అధికారులు తెలిపారు. సింహాచలాన్ని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా వచ్చే నెల పదో తేదీ వరకూ రిమాండ్ విధించినట్టు డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు తెలిపారు.

☛ సంక్షిప్తంగా..

సివిల్స్ శిక్షణ స్క్రీనింగ్ పరీక్షకు 194 మంది హాజరు

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ కోసం ఉచిత శిక్షణ పొందేందుకు అర్హత పరీక్షను బుధవారం ఎంవీపీ కాలనీలో నిర్వహించారు. బీసీ స్టడీ సర్కిల్ భవనంతో పాటు సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ భవనంలోని మరో హాలులో ఉదయం పది కొండు గంటల నుంచి ఒంటి గంట వరకూ అభ్యర్థులకు పరీక్ష నిర్వహించారు. 240 మంది శిక్షణ కోసం దరఖాస్తు చేయగా 194 మంది హాజరయ్యారని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు.

పీఎం అజయ్ పథకం లబ్ధిదారులకు అవగాహన



సదస్సుల పాల్గొన్న లబ్ధిదారులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ మండలాల్లో ఎంపిక చేసిన 36 మంది స్వయం సహాయక సంఘాలలోని లబ్ధిదారులతో గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ లక్ష్మీపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి బుధవారం పెందుర్తి సమాఖ్య కార్యాలయంలో పీఎం అజయ్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెర్ప్ ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ స్వయం సహాయక సంఘ మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రధానమంత్రి అనుచిత్ జాతి అభ్యుదయ్ యోజన అనే పథకం పేరుతో రూ. 50 వేలు రాయితీతో వడ్డీ లేని రుణం అందిస్తామని లబ్ధిదారులకు వివరించారు. ఈ పథకాన్ని వినియోగించుకోవాలని, తిరిగి సక్రమంగా చెల్లించడం ద్వారా మళ్లీ పెట్టుబడి రుణం పొందే అవకాశం ఉంటుందని అధికారులు లబ్ధిదారులకు వివరించారు.

ప్రొ.సీతారత్నంకు అభినందనలు



సీతారత్నంను అభినందిస్తున్న రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కతర్ దేశ రాజధాని దోహా నగరంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఏయూ కళావేదిక, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంయుక్తంగా నిర్వహించిన తొమ్మిదో ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో ఆచార్య అయ్యగారి సీతారత్నం 'పోతన భాగవతంలో స్త్రీ పాత్రలు' అనే అంశంపై ఆహ్వానిత ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఏయూ రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయ్‌రావు బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఏయూలో గతంలో నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు పత్రాల సంకలనం ప్రవాస సాహిత్యం అనే పుస్తకాన్ని రిజిస్ట్రార్ ఆచార్య అయ్యగారి సీతారత్నంకు అందజేశారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
● **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర
● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 56, టమాటా 44, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 35, క్యాబేజి 36, క్యారెట్ 76 దొండకాయలు 32, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 340 దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 44, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 28, కంద 60, దేముడు చిక్కుడు 62, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

పార్కు నిర్వహణ పట్టించుకోరా!

హెచ్‌బీ కాలనీలోని అబ్దుల్ కలాం పార్కులో ఆవుల సంచారంతో అపరిశుభ్రత



చెత్తాచెదారాలు, ఆవు పేడలతో ఉన్న అబ్దుల్ కలాం పార్కులో ఆట స్థలాలు

వెంకోజీపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పార్కుల అభివృద్ధిని స్థానిక ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రోజూ ఆ పార్కుకు వచ్చే షటిల్ బ్యాడ్మింటన్ ఆటగాళ్లు వేల రూపాయలు ఖర్చు చేసి షటిల్ గ్రౌండ్‌లను తయారు చేసుకున్నారు. అయితే పార్కు అభివృద్ధికి ఎటువంటి ఆలోచన చేయకపోగా ఈ పార్కులో ఆవుల సంచారంతో ఆటగాళ్లు, చిన్నారులు ఎదు ర్కొంటున్న సమస్యలను కూడా పట్టించుకోకపోవడంపై వారంతా ఆవేదన చెందుతున్నారు. ఇదీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కు దుస్థితి.

ఈ పార్కుకు ప్రతి రోజూ ఉదయాన్నే లేచి వ్యాయామం చేసేందుకు పెద్దలు, ఆట విడుపు కోసం షటిల్ క్రీడాకారులు, అలాగే కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు వస్తుంటారు. అయితే వారందరూ పార్కుకు రాగానే ముందుగా ఆవుల పేడలను ఎత్తే కార్యక్రమం చేపట్టాల్సిందే. చిన్నారుల నుంచి పెద్దవారి వరకూ ముందు ఈ ఆవు పేడలను ఎత్తిన తరువాత తమ కార్యకలాపాలను నిర్వర్తించుకునే దుస్థితి నెలకొంది. దీనికి తోడు పార్కు చుట్టు పక్కలున్న వారు తమకేమైనా శుభకార్యాలు ఉంటే ఈ పార్కులో నిర్వహించుకుంటూ, అనంతరం మిగిలిన చెత్తా చెదారాన్ని వదిలి వేయడం వలన ఆటగాళ్లు, చిన్నారులు మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలోనున్న స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ఖాళీ స్థలం, రోడ్లపైన విరివిగా ఆవులను పెంచుతున్నా కనీసం పట్టించుకోని జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులు, పార్కులో వీటి సంచారాన్నైనా అదుపు చేయాలని ఆటగాళ్లు, చిన్నారులు, మహిళలు కోరుతున్నారు.



హెల్త్ ఎరీనాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

హెల్త్ ఎరీనాలో వసతులు మెరుగుపరుస్తాం

» వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అప్పుఘర్ నుంచి ఎంవీపీ కాలనీ మీదుగా హనుమంతవాక వరకూ ఉన్న హెల్త్ ఎరీనాలో వసతులు మెరుగుపరుస్తామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ గోపాల్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ బుధవారం ఈ ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. పాడైనవి తొలగించడం, అవకాశమున్న వాటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. మార్నింగ్ వాక్‌కు వచ్చిన వారితో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

మేధోపర హక్కుల సాధనపై సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మేధోపరమైన హక్కుల సాధనపై ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. 'ఎంపవరింగ్ ఇన్నోవేటర్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్స్' అంశంపై నిర్వహించిన ప్రసంగాలతో విద్యార్థులకు పలు అంశాలపై వక్తలు అవగాహన కలిగించారు. ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఏఐసీటీఈ, నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఐఐసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కృష్ణవేణి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ హిప్సిబారాణీ సింగ్ ఆధ్వర్యంలో ఎన్ఆర్డీసీ సైంటిఫిక్ ఆఫీసర్ సుధా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యూజీ కోర్సుల డైరెక్టర్ డి.గిరిధర్, ప్రిన్సిపాల్ ఆచార్య కేఎస్ బోస్, లైఫ్ సైన్సెస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఇల్లాహి షేక్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ కృషితో రెండున్నరేళ్ల తర్వాత

కుటుంబం చెంతకు వృద్ధుడు



తాతాను మనవడికి అప్పగిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు మురళి

పెదవాల్తేరు, నవంబర్ 27 : ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు ఓ అభాగ్యుడిని తన ఇంటి వారి వద్దకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. మధురవాడకు చెందిన గొలగాని చింతాలు (70) రెండున్నరేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి భార్య కరోనాతో మృతి చెందింది. చింతాలు కుమారుడు పాల్ పలు చోట్ల వెతికినా తండ్రి ఆచూకీ లభించ లేదు. ఈ నేపథ్యంలో తన ఉద్యోగ రీత్యా పాల్ కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లిపోయారు. కొన్నాళ్ల తర్వాత చింతాలు మధురవాడలోని కుమారుడి ఇంటి వద్దకు రాగా, ఇంటి తలుపులు మూసి ఉండడం చూసి స్థానికులకు ఆరా తీశారు. దీంతో కుమారుడు కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లిన విషయం తెలిసింది. ఈ క్రమంలో విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాన్నే కేరాఫ్ అడ్రస్‌గా చేసుకున్నాడు.

ఇదిలావుండగా, జోన్-1లో 2022న రెడ్ క్రాస్ సిబ్బంది రైల్వే స్టేషన్ ప్రాంతంలో రెస్క్యూ చేస్తుండగా చింతాలు ప్లాట్ ఫారంపై నిద్రిస్తూ కనిపించాడు. ఆరా తీసి, అతడిని రెడ్ క్రాస్ షెల్టర్ లెస్ హోంకు తరలించారు. చింతాలు కుడి కన్నుకు సమస్య వచ్చి అంధకారంగా మారడంతో పెదవాల్తేరులోని విశాఖ ఐ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స కూడా చేయించారు. అనంతరం రెడ్ క్రాస్ సిబ్బంది మధురవాడ వెళ్లి చింతాలు కుమారుడి కోసం ఆరా తీయగా, కొద్దిగా దొరికిన సమాచారంతోనే హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉంటున్నట్లు తెలుసుకున్నారు. చివరకు పాల్ అడ్రస్ దొరకడంతో సమాచారం అందజేశారు. చింతాలు మనుమడు క్రాంతి కుమార్ తన స్నేహితుడితో కలిసి విశాఖలోని రెడ్ క్రాస్ షెల్టర్‌కు వచ్చారు. తాతా, మనుమళ్లు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన తాతాను చూసి రెండున్నరేళ్లయిందని, అయన ఆచూకీ దొరకకపోవడంతో చనిపోయాడనుకున్నామని క్రాంతికుమార్ కళ్లలో ఆనంద బాష్పాలు రాలుతుండగా చెప్పాడు. తమ తాతాను తమకు క్షేమంగా అప్పగించినందుకు రెడ్ క్రాస్ సేవలను క్రాంతి కొనియాడారు. ఇన్నాళ్ల తర్వాతైనా చింతాలును వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించడం సంతోషంగా ఉందని పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హోంలెస్ షెల్టర్ మేనేజర్ మురళీ ఆనందం వ్యక్తం చేశారు.

విమ్స్ ఉద్యోగుల దాతృత్వం

» సహోద్యోగి కుమారుడి వైద్యానికి రూ.1.3 లక్షల వితరణ

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సహోద్యోగి కుమారుడు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతుండగా, తోటి ఉద్యోగులంతా ముందుకు వచ్చి సహాయం అందించడం అభినందనీయమని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పేర్కొన్నారు. 'విమ్స్'ల నర్సుగా పని చేస్తున్న బాలు కుమారుడు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నాడు. అతడి వైద్యం కోసం బాలు దేశంలోని ఎన్నో ఆస్పత్రుల్లో ఫలితం లేకపోయింది. మరోవైపు బాలు ఆర్థికంగా చితికిపోయారు. దీంతో సహచర ఉద్యోగులు కొందరు చొరవ తీసుకొని విమ్స్ సిబ్బంది నుంచి రూ.1.30 లక్షలు సేకరించారు. ఆ మొత్తాన్ని విమ్స్ డైరెక్టర్ రాంబాబు చేతుల మీదుగా బాలుకు అందజేసి తమ గొప్పతనాన్ని చాటుకున్నారు. రాయ్‌వెల్లూరులోని సీఎంసీ వైద్యశాలకు బాలుడిని తీసుకొని వెళుతున్న తరుణంలో తనకు ఈ సహాయం అందించిన అందరికీ బాలు ధన్యవాదాలు తెలిపారు. ఎవరైనా ఆర్థిక సహాయం చేయాలంటూ ఫోన్ నంబరు : 93986 09381లో సంప్రదించాలని ఉద్యోగులు కోరారు.

విద్యార్థులకు నాణ్యతతో ఆహారం అందించాలి : డీవైఈవో



మధ్యాహ్న భోజన వంటలను పరిశీలిస్తున్న సోమేశ్వరరావు

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలను రుచికరంగా అందించాలని ఉపాధ్యాయులకు జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు సూచించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్ మంగళవారం తోటగరువు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును పర్యవేక్షించిన నేపథ్యంలో డిప్యూటీ డీఈవో ఈ పాఠశాలను బుధవారం సందర్శించారు. పరిసరాలు శుభ్రత, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించే విషయంలో ఎంతమాత్రం నిర్లక్ష్యం తగదన్నారు. ఆయన మధ్యాహ్నం భోజన వంటకాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి మెరుగైన బోధన అందించాలన్నారు. ఈ పర్యటనలో ఎంఈవో-1 రవీంద్రబాబు, ఎంఈవో-2 అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



నిర్మాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 10వ వార్డులో గల పాత డెయిరీ ఫారానిక సమీపంలో గల ఇందిరా నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టిన అంతస్తులను బుధవారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారు. ఓ భవనం నిర్మాణంలో అనుమతులు లేకుండా నిర్మించిన 5, 6 అంతస్తులను ఏసీపీ ఎం.తిరుపతిరావు, టీడీవో బాలరాజు ప్రభాకర్ ఆధ్వర్యంలో తొలగించారు. నగరంలోని ఇలాంటి అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.14 లక్షలతో పక్షుల మోటులు ఆధునికీకరణ



నెమలుల మోటు వద్ద నిర్మిస్తున్న ఫుట్‌పాత్

» జూ క్యూరేటర్ మంగమ్మ

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో గల వివిధ పక్షుల మోటుల వద్ద ఆధునీకరణ పనులు చేపడుతున్నట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సుమారు రూ.14 లక్షల సీఎస్ఆర్ నిధులతో లవ్ బర్డ్స్ మోటు వద్ద మరమ్మతులు చేపడుతున్నట్టు వెల్లడించారు. కొత్తగా పై కప్పులు, గోడలను ఎత్తుగా చేయడం, మరింత వెలుగు ప్రసరించేలా ప్రత్యేంగా గ్లాసులతో ఏర్పాటు వంటి పనులను 12 మోటుల వద్ద చేపడుతున్నట్టు వెల్లడించారు. అలాగే మోటుల ఎత్తు పెంచడం వల్ల సందర్శకుడు వాటిని చూసేందుకు మరింతగా వీలు ఉంటుందన్నారు. అలాగే పక్షులకు ఎలాంటి శబ్దాలు వినిపించకుండా ప్రత్యేక జాగ్రత్తలు వహిస్తున్నట్టు చెప్పారు. నెమలుల మోటు వద్ద సుమారు 12 లక్షలతో క్యాంపు నిధుల నుంచి (జూ ఆదాయం) ఫుట్‌పాత్‌లను నిర్మిస్తున్నట్టు క్యూరేటర్ మంగమ్మ చెప్పారు.



గ్లాస్‌లతో నిర్మాణాలు చేపడుతున్న లవ్ బర్డ్స్ మోటులు

శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదానం



పెదవాల్తేరు, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని బుధవారం పెదవాల్తేరులోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త సీహెచ్ జ్యోతి అధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు.

రైతులు, రైతు కూలీల మధ్య సమన్వయం తప్పనిసరి

» ఏయూ పూర్వపు వీసీ నాగేశ్వరరావు
» వర్సిటీలో 'సోషియో ఎకనామిక్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ల్యాండ్లెస్ అగ్రికల్చరల్ లేబరర్స్' సదస్సు



మాట్లాడుతున్న ఏయూ పూర్వపు వీసీ నాగేశ్వరరావు

వెంకోజీపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు, రైతు కూలీల మధ్య సమన్వయం ఎంతో అవసరమని ఏయూ పూర్వ వీసీ జి.నాగేశ్వరరావు అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో బుధవారం నిర్వహించిన 'సోషియో ఎకనామిక్ ఎంపవర్మెంట్ ఆఫ్ ల్యాండ్లెస్ అగ్రికల్చరల్ లేబరర్స్' సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సదస్సును ఏయూ సైకాలజీ విభాగం, అగ్రో ఎకనామిక్స్ రీసెర్చ్ సెంటర్, సిఫా ట్రస్టు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆచార్య నాగేశ్వరరావు మాట్లాడుతూ సంతోషమనేది బాహ్య పరిసరాలతో గణించేది కాదని, ఇది పూర్తిగా మనసుకు సంబంధించిందని చెప్పారు. రైతుకూలీల మానసిక సన్నద్ధత, స్థైర్యాన్ని పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ రైతులు, రైతు కూలీల్లో ఆర్థిక, మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని చెప్పారు. సమాజంలో రైతులు, భూమి లేని రైతు కూలీలు కూడా ఎంతో కీలకమన్నారు. వ్యవసాయ రంగం వీరిద్దరిపైనా ఆధారపడి ఉందన్నారు. రైతు కూలీలకు పంటలు పండించే సమయంలో ప్రకృతి సమస్యలు, ధరల్లో స్థిరీకరణ లేకపోవడం ఇబ్బందికరంగా మారుతోందన్నారు. అంతేకాకుండా కుటుంబ సమస్యలు, ఆరోగ్య సమస్యలు వీరికి అదనపు భారంగా మారుతున్నాయని, పర్యవసానంగా కొందరు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారని చెప్పారు. వీరికి నమ్మకం ధైర్యం కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీలో 256 పైగా సైకాలజీ ఉద్యోగాలకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు.

అగ్రో ఎకనామిక్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర లిల్లీ గ్రేస్ మాట్లాడుతూ రైతు కూలీలకు సంప్రదాయ, ఆధునిక సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. రైతులు, రైతు కూలీలపై పర్యావరణ మార్పులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. సామాజిక సమరస్తా ఆల్ ఇండియా కన్వీనర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ రైతులు, రైతు కూలీలు వేర్వేరు కాదని అన్నారు. రైతు కూలీలను వేరుగా చూడడం సరికాదని, వీరిద్దరూ కలిసి ముందుకు సాగాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడి వారి ఆలోచనలు అడిగి తెలుసుకున్నారు. సదస్సులో భాగంగా దేశీయ విత్తనాలను ప్రదర్శనలో ఉంచారు. దాదాపు 300 కు పైగా దేశీ జాతుల విత్తనాలను ప్రదర్శించారు. ఈ సదస్సులో విశ్రాంత ఆచార్యులు సి.సాంబమూర్తి, సిఫ డైరెక్టర్ డాక్టర్ శశి ప్రభా, పరిశోధకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చింతలలోవలో మహిళపై వీధి కుక్కల దాడి

» చెవి భాగానికి తీవ్ర గాయం



గాయపడిన మహిళ చెవి భాగం

సింధియా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం చల్లా లక్ష్మి (43) అనే మహిళ చింతలలోవలో గల బంధువుల ఇంటికి వెళ్తుండగా ఒక్కసారిగా పలు కుక్కలు ఆమెపై దాడి చేసి చెవి భాగాన్ని తీవ్రంగా గాయపరిచాయి. కింద పడిపోయిన ఆమె భయంతో పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకోవడంతో శునకాలు పారిపోయాయి. చెవికి తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా గ్రామంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయని పలువురు స్థానికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. లక్ష్మి అనే మహిళ చెవి భాగాన్ని తీవ్రంగా గాయపరిచాయని వివరించారు. అందుకు స్పందించిన ఆయన తక్షణమే వీధి కుక్కల పట్టివేతకు చర్యలు చేపట్టారు. అప్పటికప్పుడు ఎనిమిది శునకాలను సిబ్బంది పట్టుకుని అక్కడ నుంచి తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల అవగాహన ర్యాలీ



వాహన చోదకులు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోటలోని శ్రీ చైతన్య స్కూలు విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన ర్యాలీనిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి విద్యార్థులు గులాబీలు, చాకెట్లు పంపిణీ చేసి భద్రతా నియమాలు, ప్రమాదాలు గురించి వివరించారు. తొలుత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహనకార్యక్రమంలో ఎంవీపీ పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి కనకరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు విద్యార్థులకు ట్రాఫిక్, భద్రతా నియమాల గురించి తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో పాటు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూలు ప్రిన్సిపాల్ ఎస్వీ రమణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సమాజ సేవ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలగాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ప్రమాదాల నివారణకు సహకరించాలని, సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల నాలుగు జిల్లాల ఏజీఎం ఎంవీ సురేష్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. పాఠశాల సిటీ ప్రాంతీయ ఇంచార్జి అహ్మద్ అలీ, డీన్ అప్పలనాయుడు, సి.ఇన్‌చార్జి భూషణ్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ మరియరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా బాధితులకు గండి బాబ్జీ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న గండి బాబ్జీ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పరవాడ ఫార్మా బాధితులను బుధవారం రాత్రి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి బాధితులు త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు.

అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో పాటు స్థానిక నాయకులు గుడివాడ లతీశ్, బొగాది సన్యాసిరావు తదితరులు పరామర్శించారు.

29న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 29న నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి 117 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు అందజేశారు.

ఈనెల 22న జరగాల్సిన ఈ సమావేశం స్టాండింగ్ కమిటీసభ్యుల కోరం లేకపోవడంతో వాయిదావేశారు. గతవారం జరగాల్సిన సమావేశం కోసం రూపొందించిన అజెండాపైనే తాజా సమావేశంలో చర్చజరుగుతుందని కార్యదర్శి వివరించారు.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అక్కాచెల్లెళ్ల ఎంపిక



ధ్రువీకరణ పత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైస్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ పోటీలకు ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థినులు ఇద్దరు ఎంపికయ్యారు. వీరిద్దరూ అక్కాచెల్లెళ్లు కావడం విశేషం. 2022 బ్యాచ్‌కు చెందిన ఆర్. హేమా హర్షిణి, 2024 బ్యాచ్‌లో ఆర్.దీపికా కీర్తి అక్కాచెల్లెళ్లు. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తరపున సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళల టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబరు 7 నుంచి 10 వరకు కర్ణాటకలోని మణిపాల్ ఎడ్యుకేషన్ అకాడమిలో జరిగే టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఎమ్ఎస్ఎన్ పాత్రుడు వీరిని అభినందించారు.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ కృషి ప్రశంసనీయం: జేవీ



ప్రదర్శనలో పుస్తకాలు పరిశీలిస్తున్న సీపీఐ నేత జేవీ సత్యనారాయణమూర్తి

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రదర్శన ద్వారా వివిధ రకాల పుస్తకాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్న విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ కృషిని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అభినందించారు. టర్నర్ చౌల్ట్రీలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనను బుధవారం ఆయన సందర్శించారు. విశాలాంధ్ర ఏటా నిర్వహించే పుస్తక ప్రదర్శనలో అరుదైన పుస్తకాలను సైతం సేకరించి ప్రజలకు అందుబాటులో ఉంచుతుంతోందని తెలిపారు. ఆయన వెంట జి.అచ్యుతరావు, అప్పలరాజు, మేనేజర్ రాజు తదితరులు ఉన్నారు.

డీఎల్ఎస్ఏ సభ్యునికి ఆర్డీవో అభినందన



సత్యనారాయణకు ఎంపిక పత్రం అందజేస్తున్న ఆర్డీవో శ్రీలేఖ

అక్కయ్యపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) సభ్యునిగా సాలిగ్రామపురం ప్రాంతానికి చెందిన వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మర్రి సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయనను రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీలేఖ అభినందించారు. విశాఖ జిల్లా నుంచి సత్యనారాయణ ఒక్కరే నియమితులయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా అన్ని ప్రాంతాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించినందుకు హైకోర్టు సమాజ సేవకునిగా గుర్తించి ఈ బాధ్యత అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ హైకోర్టు, జిల్లా కోర్టుకు కట్టుబడి ఉంటానని, ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

'విశ్వబ్రాహ్మణుల కోసం అసెంబ్లీలో మాట్లాడడం హర్షణీయం'

సీతమ్మధార, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమను దేవాలయ బోర్డు సభ్యులుగా నియమించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అసెంబ్లీలో మాట్లాడడంపై విశ్వబ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. విశాఖట్నం జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ తమకు ఏమీ చేయలేదని, ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తాళాబత్తుల రవికిరణ్, మానేపల్లికుమార్, సూర్య ఉన్నారు.

ఉక్కు ఉద్యోగులకు 30 శాతం జీతాలు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు కుటుంబాలతో చేస్తున్న ఆందోళనలకు స్పందించిన యాజమాన్యం బుధవారం మరో 30 శాతం జీతం వారి ఖాతాల్లో జమ చేసింది. అక్టోబరు జీతం ఒకటో తేదీన ఇవ్వాల్సి ఉండగా మొదటి వారంలో 35శాతం ఇచ్చింది. సెప్టెంబరు నెలకు 50శాతం మాత్రమే ఇచ్చింది. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.82 కోట్లు జీతాలకు అవసరం. సెప్టెంబరులో 50 శాతం, అక్టోబరుకు 35శాతం పెండింగ్ పెట్టారు. అంటే ఒక్కొక్కరికి 85శాతం జీతం రావాల్సి ఉంది. మరో మూడు రోజుల్లో నవంబరు ముగుస్తుంది. మళ్లీ జీతాలివ్వాలి. తాజాగా 30 శాతం ఇచ్చినందున నవంబరు జీతం ఎప్పుడు ఇస్తారోనన్న ఆందోళనలో కార్మికవర్గాలు ఉన్నాయి.

రోడ్లు విస్తరించినా ఇరుకే!

- ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాల ప్రభావం
- వన్‌టౌన్‌లో ప్రజలకు తప్పని అవస్థలు



విస్తరణ తర్వాత ఇరుగ్గా మారిన పూర్ణామార్కెట్ రహదారి



ఫుట్‌పాత్ వ్యాపారుల దగ్గర నిలిపిన ద్విచక్ర వాహనాలు

జగదాంబ కూడలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగదాంబ నుంచి వన్‌టౌన్ వరకు రోడ్డు విస్తరణ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా జీవీఎంసీ అధికారులు చేపట్టిన రోడ్డు విస్తరణకు ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచి సవాళ్లు ఎదురవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు, వ్యాపార వర్గాలు తమ స్థలాలు వదులుకొని విస్తరణకు సహకరించడం, ప్రజానీకానికి వీరి ఉదారత ఉపకరిస్తుందని భావించిన అధికార యంత్రాంగం నమ్మకం వమ్మవుతోంది. రోడ్డు విస్తరణ తర్వాత లేపాక్షి జంక్షన్ నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. రోడ్డుపై సగం వరకు ద్విచక్ర వాహనాలు నిలపడం, ఫుట్‌పాత్‌లన్నీ వ్యాపారులు ఆక్రమించడంతో పాదచారులకు యాతన తప్పడం లేదు. జగదాంబ జంక్షన్ లక్ష్మీమాల్ రోడ్డుపైన ఫుట్‌పాత్ స్థలం పూర్తిగా చిరు వ్యాపారుల గుప్పిట్లోకి వెళ్లడంతో రోడ్డు మధ్యలో జనం నడవాల్సిన దుస్థితి నెలకొంది. వాచ్‌హౌస్ లేపాక్షి కుమ్మరవీధి రోడ్డు వైపు పూర్తిగా ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమించి వస్త్రవ్యాపారాలు సాగించడం పట్ల స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాచ్‌హౌస్ లేపాక్షి మార్గం పూర్తిగా వ్యాపారాలతో మూసుకుపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాచ్‌హౌస్ రోడ్డు, దసపల్లా రోడ్డు వైపు యథావిధిగా ఫుట్‌పాత్ వ్యాపారులు రోడ్డు మీదకు రావడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. ఫుట్‌పాత్ వ్యాపారాల వద్దకు కొనుగోలుదారులు ద్విచక్రవాహనాలపై వచ్చి అక్కడే పార్కింగ్ చేస్తుండడంతో రహదారిలో సగం మూసుకుపోతోంది. టర్నర్ చౌల్ట్రీ రోడ్డు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయి. బస్‌స్టాప్ వద్ద బైక్‌లు పార్కింగ్ చేయడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. మెయిన్ ఆంజనేయ స్వామిగుడి రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణలతో నిండిపోయాయి. ట్రాఫిక్ పోలీస్‌లు ఇటువైపు చూసే పరిస్థితి లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పండుగ నేపథ్యంలో మరిన్ని ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొనవలసి వస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మహారాణిపేట, టూటౌన్ ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి తమకు దారి చూపాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డు విస్తరణ తర్వాత కూడా ట్రాఫిక్ సమస్య తలెత్తడం శోచనీయమని అంటున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణ వేడుక

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొల్లలపాలెం ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కార్తీక మాసంలో పాత జైల్‌రోడ్డు జంక్షన్ గొల్లలపాలెంలోని శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు ఈ క్రమంలో బత్తిన వెంకట త్రినాథ్, బత్తిన దంతేశ్వరరావు దంపతులతో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వేడుక నిర్వహించారు అనంతరం సమీప ప్రాంత ప్రజలకు, భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ వేడుకల్లో శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగుల సన్యాసిరావు, కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, శ్రీనివాసరావు

సీతమ్మధార, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేటలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయం దగ్గర పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి రవికుమార్, కూటమి నాయకులు పి.దీపికా అగర్వాల్, పసుపులేటి ఉషాకిరణ్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఈఈ గంగాధర్, డీఈ విజయ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణాపై బహుపరాక్!

- పార్శిల్ సంస్థలకు పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, వేదికపై నార్కోటిక్, పోలీసు అధికారులు

మహారాణిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్శిల్ పంపేందుకు వచ్చిన వ్యక్తి లేదా వ్యక్తుల ప్రవర్తనపై అనుమానం వచ్చినా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు పసిగట్టినా వెంటనే తమకు తెలియజేయాలని పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి కొరియర్ సంస్థలకు సూచించారు. పోలీసు కమిషనరేట్‌లో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో, నగర పోలీసు ఉన్నతాధికారులతో ఈ కామర్స్ ప్రతినిధులు బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు రవాణా అవుతున్న తీరును తెలియజేస్తూ, వాటిని నిరోధించేందుకు చేపట్టవలసిన చర్యలపై పలు పీపీటీల ద్వారా అవగాహన కల్పించారు. కొరియర్ పార్శిళ్లు, ఈ కామర్స్ ద్వారా వేరొక ప్రాంతానికి పంపాలనుకున్న పార్శిల్‌లో మాదక ద్రవ్యాలు లేదా చోరీ సొత్తు, బాంబు పేలుళ్లకు ఉపయోగించే పదార్థాలు ఉండవచ్చని, అప్రమత్తంగా ఉంటూ సమాచారాన్ని 7995095799 నెంబరుకు వెంటనే తెలియజేయాలని కమిషనర్ సూచించారు. సమీపంలో ఉన్న డీసీపీ, ఏసీపీ, సీఐలకు అయినా సమాచారం ఇవ్వాలని సూచించారు. తాము నిర్వహించే తనిఖీల్లో ఇలాంటివి దొరికితే కొరియర్ సంస్థలపై కూడా చర్యలు తీసుకోవలసి వస్తుందని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల సరఫరాలో కొరియర్ సిబ్బంది ప్రమేయం బయటపడిందని, ఇకపై నిర్లక్ష్యంగా ఉండకుండా అప్రమత్తం కావాలని సూచించారు. రెడ్‌ఫ్లాగ్ సూచికలను పాటించాలన్నారు. ఎన్‌సీబీ అధికారులు సచిన్‌గోర్పడే, టి.జి. వెంకటేష్, వివిధ స్థాయిల పోలీసు అధికారులు, పార్శిల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దత్తత కోసం నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం కారా (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఏఆర్ఏ.జీవోవీ.ఇన్) పేరుతో వెబ్‌సైట్ రూపొందించింది. దత్తత కావాలనుకునేవారు ఇందులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పాన్‌కార్డు వివరాలను నమోదుచేసి లాగిన్ అయిన తరువాత చిరునామాతోపాటు ఐటీ, ఇతర వివరాలను నమోదుచేయాలి. వాటిని పరిశీలించిన తరువాత అధికారులు అర్హులను గుర్తిస్తారు. ఇలా గుర్తించిన వారికి అందుబాటులో ఉన్న చిన్నారులు, ప్రయారిటీ మేరకు దత్తత ఇచ్చే చర్యలు చేపడతారు.

దత్తతకు రెండు కేటగిరీలు

దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు రెండు కేటగిరీల పిల్లలను దత్తత ఇస్తారు. సరండెడ్ (అప్పగించిన), అబాండెడ్ (వదిలేయబడిన) పిల్లలు. కుటుంబ ఆర్థిక స్థితిగతులు సహకరించక పిల్లలను వద్దనుకునేవారు అధికారులకు తమ పిల్లలను సరండర్ చేస్తారు. ఇలా పిల్లలను తీసుకున్న తరువాత అధికారులు తల్లిదండ్రులకు 60 రోజుల సమయం ఇస్తారు. ఈలోగా వారు మనసు మార్చుకుని వస్తే పిల్లలను తిరిగి అప్పగిస్తారు. అప్పటికీ రాకుంటే దత్తతకు అర్హులుగా భావించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇక రెండో కేటగిరీ పిల్లలను కూడా ఇదేవిధంగా దత్తత ఇస్తారు. ఈ పిల్లలకు సంబంధించి పత్రికల్లో ప్రకటనలు ఇస్తారు. వారికి సంబంధించిన వారెవరూ 30 రోజుల్లోగా రాకుంటే బాలల న్యాయ చట్టం ప్రకారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దత్తతకు అర్హులుగా భావించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తుంది. దేశంలో అధికారికంగా దత్తత తీసుకునే ప్రక్రియ 2005లో ప్రారంభమైంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటివరకూ 159 మందిని దత్తత ఇచ్చారు. ప్రస్తుతం వివిధ శిశుగృహాల్లో 15 మంది చిన్నారులుండగా, ఇందులో నలుగురిని మాత్రమే దత్తత ఇచ్చేందుకు అర్హులుగా గుర్తించారు.

పెళ్లైన నెల రోజులకే అనంత లోకాలకు...

... 5వ పేజీ తరువాయి

రూపేష్‌కుమార్ ఇక్కడకు ఎప్పుడు వచ్చాడో, ఎందుకు వచ్చాడో తెలియదని అతని తల్లి, పవన్‌కుమార్ అక్క సంఘటనా స్థలం వద్ద బోరున విలపించింది. సమాచారం అందుకున్న స్టీల్ ప్లాంటు శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

పెళ్లైన నెల రోజులకే...

ఈ ప్రమాదంలో మృతిచెందిన పవన్‌కుమార్‌కు గత నెల 26న వివాహమైందని అతని అక్క తెలిపింది. కూర్మన్నపాలెం శాతవాహన నగర్ ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడని, మరి కొద్దిరోజుల్లో భార్యను ఇక్కడకు తీసుకువచ్చేందుకు చూస్తున్న సమయంలో ఘోరం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది.

బాల్య వివాహాల కట్టడిపై చైతన్యం

డాబాగార్డెన్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'బాల్య వివాహాల ముక్త్ భారత్' నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు.ర్యాలీని మహిళ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి.జయదేవి, జిల్లా న్యాయసేవా సమితి కార్యదర్శి వెంకట శేషమ్మ ప్రారంభించారు.తదుపరి జగదాంబ సెంటర్ వద్ద అంగన్వాడీ కార్యకర్తలతో మానవహారం చేపట్టారు. బాల్య వివాహాల నిరోధానికి తాముసైతం భాగస్వాములవుతామని ప్రతినబూనారు. మహిళ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓలు శారదాదేవి, రమణీకుమారి, శ్రీలత, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సారూ... సమస్యలు పరిష్కరించరూ!



దొండపర్తిలో ప్రజల సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

దొండపర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దొండపర్తిలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యలలో ప్రధానంగా...శిథిలావస్థలో ఉన్న దొండపర్తి ప్రాంతంలోని నెహ్రూ బజారును కూలగొట్టి కొత్తది నిర్మించడం, శ్రీనగర్ కో-ఆపరేటివ్ కాలనీ దగ్గర రజకులకు ఇళ్ల నిర్మాణం, భగత్‌సింగ్‌నగర్‌లో సచివాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించి సామాజిక భవనాన్ని ప్రజోపయోగం మేరకు అందుబాటులోకి తీసుకురావడం, శిథిలావస్థలో ఉన్న మీ సేవా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం, గెడ్డల ఆధునికీకరణ, మండావారి వీధిలోని ప్రభుత్వ పాఠశాలకు మరమ్మతులు, రోడ్డు నిర్మాణం తదితర సమస్యలను ప్రజలు ఏకరవు పెట్టారు. డ్రైనేజీ వ్యవస్థ, సామాజిక భద్రత పింఛన్లు, గృహ నిర్మాణం చేపట్టాలని కోరారు. వారి సమస్యలను ఎమ్మెల్యే వంశీకృష్ణ ఓపిగ్గా విన్నారు. అనంతరం మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తన తదుపరి పర్యటనలో ఈ సమస్యలు మళ్లీ తన దృష్టికి రాకుండా అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, జనసేన అధ్యక్షుడు గుండు సురేష్, బీజేపీ అధ్యక్షుడు మహేష్, కూటమి నాయకులు లక్ష్మీ శివప్రసాద్, పీవీ రమణ, జోనల్ కమిషనర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

డయేరియా బాధిత కుటుంబాలకు పరామర్శ

జగదాంబ కూడలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులను ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశించారు. బుధవారం జబ్బర్ తోట ఏరియాలో డయేరియా బాధిత కుటుంబాలను పరామర్శించి మాట్లాడారు. అక్కడ పారిశుధ్యం, మురుగునీటిపారుదల, తాగునీటి సరఫరా తీరుపై ఆరాతీశారు. బాధితులకు కేజీహెచ్‌లో వైద్యం అందించాలని సూచించారు.

వార్డుల అభివృద్ధిపై దృష్టి

పూర్ణామార్కెట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ పరిధిలో పలు వార్డుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం 35, 39 వార్డుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35వ వార్డు పరిధిలో రూ 35.5 లక్షలతో ఆయిల్‌మిల్ రోడ్డు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. 39వ వార్డు ఫెర్రి రోడ్డు అభివృద్ధికి రూ.18.5 లక్షలు, పాతపోస్టాఫీసు వద్ద రూ.40 లక్షలతో అదనపు భవన నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహా మేతగాళ్లు

... 5వ పేజీ తరువాయి

వెళుతుంది. అయితే ప్లాన్ దరఖాస్తు వార్డు ప్లానింగ్ సెక్రటరీ లాగిన్‌కు వెళ్లగానే వసూళ్ల వేట మొదలైపోతుంది. కొంతమంది నిజాయితీగానే పనిచేస్తున్నా...మరికొందరు మాత్రం బిల్డర్లు, ఎల్‌టీపీలతో ముందుగానే అవగాహన ఏర్పరచుకుని జేబులు నింపుకుంటున్నారు. కొందరైతే కార్పొరేటర్లతో మిలాఖత్ అయిపోయి వారు చెప్పినట్టు నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పొరేటర్ వద్దంటే ఆ ప్లాన్ దరఖాస్తును పెండింగ్‌లో పెట్టడమో, ఏదో కారణంతో తిరస్కరించడమో చేస్తున్నారు. కార్పొరేటర్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తే మాత్రం తమ వాటా తీసుకుని పైస్థాయి అధికారికి దరఖాస్తును పంపుతున్నారు. వార్డు సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత బిల్డింగ్ ప్లాన్‌ల జారీలో అవినీతి, అక్రమ నిర్మాణాలు పెరిగిపోయాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యక్తిగత నివాసానికి ప్లాన్ తీసుకుని ఇరుకురోడ్లలో అపార్టుమెంట్‌లు నిర్మిస్తుండడం, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేయడం, ప్రభుత్వ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి అడ్డదారిలో ప్లాన్ పొందడం వంటివి కళ్లముందే జరుగుతున్నా వార్డు ప్లానింగ్ సెక్రటరీల అటు వైపు కన్నెత్తి చూడరు. ఫిర్యాదులు అందినా చర్యలు లేకుండా కాపాడుతున్నారు. తాజాగా జోన్-8 పరిధిలోని సుజాతనగర్‌లో జీ+2 నిర్మాణానికి ప్లాన్ తీసుకుని అదనంగా మరో మూడు అంతస్థులు నిర్మించేసినా చర్యలు తీసుకోకపోగా, అందుకు పరోక్షంగా సహకరించారనే అభియోగంపై ప్లానింగ్ సెక్రటరీని కమిషనర్ సంపత్‌కుమార్ సస్పెండ్ చేశారు. ప్రతి వార్డులో కమిషనర్ తనిఖీలు చేస్తే మరెంతో మంది ప్లానింగ్ సెక్రటరీలు, దిగువస్థాయి ఉద్యోగులు సస్పెండవడం ఖాయమని టౌన్‌ప్లానింగ్ అధికారులే చెబుతుండడం విశేషం.

ఇంజనీరింగ్ విభాగంలో కూడా కొంతమంది అధికారులు ఏళ్ల తరబడి తిష్ట వేసుకుని అవినీతికి పాల్పడుతున్నారు. జీవీఎంసీ పరిధిలో ఏటా రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులు (సీసీ రోడ్లు, తారురోడ్లు నిర్మాణం, డ్రెయిన్లు రిపేరు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, రంగులు వేయడం, నీటి సరఫరా పైప్‌లైన్‌ల ఏర్పాటు, మరమ్మతులు, నిర్వహణ వంటి పనులు) జరుగుతూనే ఉంటాయి. వీటికి అంచనాలు తయారు చేయడంతో మొదలయ్యే అవినీతి టెండర్లు పిలవడం, పనులు పూర్తిచేసిన తర్వాత రికార్డింగ్, బిల్లులు చెల్లింపు వరకూ కొనసాగుతోంది. ఒక పనికి వాస్తవంగా రూ.లక్ష ఖర్చు అయితే ఇంజనీరింగ్ అధికారులు మాత్రం రెట్టింపు మొత్తానికి ప్రతిపాదనలు తయారుచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆయా పనులను అస్మదీయులైన కాంట్రాక్టర్లకు దక్కేలా చేస్తుంటారు. ఒకవేళ వేరేవారు ఎవరైనా పనులు దక్కించుకుంటే ముప్పుతిప్పలు పెట్టి నష్టం వచ్చేలా చేస్తారు. నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు భారీగా అవినీతికి పాల్పడడం ద్వారా రూ.కోట్లు సంపాదించారని ఇంజనీరింగ్ విభాగంలో ప్రచారం జరుగుతోంది. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల పరిస్థితే అలా ఉంటే ఇంజనీర్ల పరిస్థితి ఎలా ఉంటుందనేది ఊహించాల్సిందే మరి!

జీవీఎంసీలో మరో కీలక విభాగంగా చెప్పుకునే రెవెన్యూలోనూ భారీగానే అవినీతి జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయాల్లో అడ్మిన్‌లు అడ్డదారిలో అసెస్‌మెంట్‌లు జారీచేసి జేబులు నింపుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో జోన్-8 పరిధిలో ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డిజిటల్ కీని ఉపయోగించి అక్కడ పనిచేసే వార్డు సచివాలయ అడ్మిన్ (డిజిటల్ అసిస్టెంట్) అడ్డగోలుగా 400 వరకూ తప్పుడు అసెస్‌మెంట్‌లు జారీ చేసేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఆర్ఐ, వార్డు సచివాలయ అడ్మిన్‌ను అప్పటి కమిషనర్ సృజన సస్పెండ్ చేశారు. అదే సమయంలో జోన్-5 పరిధిలోనూ పెద్దఎత్తున అక్రమ అసెస్‌మెంట్‌లను జారీచేసినట్టు వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో అక్కడ జోనల్ కమిషనర్‌గా తాజాగా ఏసీబీకి పట్టుబడిన జోన్-2 కమిషనర్‌గా పొందూరు సింహాచలం పనిచేస్తున్నారు. అపార్టుమెంట్‌లు, వాణిజ్య భవనాలు నిర్మించే సమయంలో మూడేళ్లకు సంబంధించిన ఖాళీ స్థలంకు పన్ను చెల్లించాలి. అలా కాకుంటే ప్లాన్ జారీకాదు. అలాంటప్పుడు నిర్మాణదారులు, బిల్డర్లు రెవెన్యూ విభాగంలోని సిబ్బందిని ప్రసన్నం చేసుకుని అక్కడ చాలాకాలంగా షెడ్డు ఉన్నట్టు చూపించి ఒక డోర్ నంబర్ కేటాయించి ఆస్తి పన్ను విధించేస్తున్నారు. దీనివల్ల రూ.లక్షల్లో కట్టాల్సిన వీఎల్‌టీ భారం కేవలం రూ.వందల్లోకి తగ్గిపోతోంది. అలాంటి సందర్భంలో రెవెన్యూ సిబ్బంది భారీగా గుంజుతున్నారు. ఇలాంటి వాటిపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ లోతుగా దృష్టిసారిస్తే అక్రమార్కులకు అడ్డుకట్టపడుతుంది.

టమాటా రూ.44

5వ పేజీ తరువాయి

టమాటా అందుబాటులోకి వస్తుందని, అప్పుడు ధర తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

తగ్గని ఉల్లి రేటు...కిలో రూ.56

ఉల్లిపాయల రేటు మార్కెట్‌లో దిగి రావడం లేదు. గత మూడు నెలలుగా కిలో రూ.50పైనే అమ్ముతున్నారు. రైతుబజార్లలో బుధవారం నాటి ధర కిలో రూ.56. ఇది షోలాపూర్ నుంచి తెచ్చిన సరకు అని చెబుతున్నారు. కర్నూలు ఉల్లి కిలో రేటు రూ.30 మాత్రమే ఉన్నా దానిని వ్యాపారులు తీసుకురావడం లేదు. అది ఇప్పుడే కోతకు వచ్చిన పంట అని, నిల్వ ఉండదని అంటున్నారు. ఏదేమైనా రెండు రకాలు అందుబాటులో ఉంచితే ఎవరికి నచ్చింది వారు కొనుగోలు చేస్తారని, మార్కెటింగ్ శాఖాధికారులు దీనిపై దృష్టి పెట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

వాల్తేరు డివిజన్‌ను కొనసాగించండి

... 5వ పేజీ తరువాయి

నిర్మాణానికి చాలా సమయం పడుతుందని, అది పూర్తయ్యేంత వరకూ వేచి చూడకుండా ముందుగానే కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. ఈస్ట్ కోస్ట్, వెస్టర్న్ రైల్వే జోన్లు కూడా ఇలాగే కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. అదేవిధంగా వాల్తేరు రైల్వే డివిజన్‌కు వందేళ్ల చరిత్ర ఉందని, దానిని కొనసాగించాలని కోరారు. ముంబై, కోల్‌కతా నగరాల్లో కూడా రైల్వే డివిజన్లు ఉన్నాయని, ఆ విధంగానే వాల్తేరు డివిజన్‌ను ఉంచాలన్నారు. దానిని విడగొట్టాలనే నిర్ణయంపై పునఃసమీక్ష చేయాలన్నారు. ఇది ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను సంబంధించిన అంశంగా పేర్కొన్నారు.

విశాఖ నుంచి ఇతర ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ పెంచాల్సి ఉందన్నారు. విశాఖ నుంచి బెంగళూరు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉందని, ఇందుకు డైలీ సర్వీస్ అందుబాటులోకి తేవాలన్నారు. విశాఖపట్నంలో ఐటీ, పర్యాటక రంగం అభివృద్ధికి బెంగళూరు శాశ్వత రైలు చాలా దోహదపడుతుందన్నారు. విశాఖపట్నం-తిరుపతి నగరాల మధ్య వందేభారత్ సర్వీస్ వేయాలన్నారు. అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్న దువ్వాడ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైళ్లకు అదనపు స్టాప్ కేటాయించాలని కోరారు. దీనివల్ల పరవాడలోని ఫార్మా సిటీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంటు, అచ్యుతాపురం సెజ్ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

30నే సామాజిక పింఛన్ల పంపిణీ

... 5వ పేజీ తరువాయి

ఫిబ్రవరి నెల పింఛన్‌తో కలిపి మూడు (డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి) నెలల పింఛన్ ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించింది. వరుసగా మూడు నెలలు తీసుకోకపోతే సదరు పింఛన్‌దారు వలస వెళ్లినట్టుగా పరిగణిస్తారు. అందువల్ల పింఛన్‌దారులు వీలును బట్టి ప్రతినెలా మొదటి వారంలోనే తీసుకోవాలని, అనివార్య కారణాల ఇబ్బంది వస్తే మూడు నెలల వరకూ పింఛన్ తీసుకునే అవకాశం ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

కొనసాగిన ఏసీబీ సోదాలు

... 5వ పేజీ తరువాయి

సింహాచలం అకౌంట్‌కే జమ అవుతున్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. రెండు రోజుల సోదాల్లో రూ.2.5 కోట్లు విలువ చేసే ఆస్తులను గుర్తించామని, వాటి మార్కెట్ విలువ రూ.30 కోట్లు వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నట్టు అధికారులు తెలిపారు. సింహాచలాన్ని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా వచ్చే నెల పదో తేదీ వరకూ రిమాండ్ విధించినట్టు డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు తెలిపారు.

కాలువల్లో తాగునీటి పైపు లైన్లు

ఇటీవల నీరు కలుషితమై డయేరియా ప్రబలడంతో భయాందోళన చెందుతున్న ప్రజలు

గాజువాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గంలో అధిక శాతం జీవీఎంసీ తాగునీటి పైపు లైన్లు మురుగు కాలువల్లో, వాటిని ఆనుకుని ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. 67వ వార్డు పరిధిలోని సాయిరాంనగర్‌లో ఇటీవల పైపు లైన్‌కు రంధ్రం పడడంతో తాగునీటిలో మురుగు కలిసి కలుషితమ్వడంతో పలువురు డయేరియా బారినపడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మిగతా వార్డుల్లోని ప్రజలు జీవీఎంసీ కొళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని తాగేందుకు బీతిల్లుతున్నారు. మూడు రోజుల పాటు కలుషితమైన తాగునీరు వచ్చినప్పటికి నాల్గో రోజు దుర్గంధమైన వాసన రావటంతో ప్రజలు గుర్తించారు. అయితే అప్పటికే కలుషిత నీరు త్రాగటం వలన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గాజువాకలోని అన్ని వార్డుల్లో ఎప్పుడో 30ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్‌లు ఇప్పటికి ఉన్నాయి. వీటికి రంధ్రాలు ఏర్పడితే తాత్కాలిక మరమ్మత్తులు చేస్తున్నారే తప్పా శాశ్వత పరిష్కారంను అధికారులు చూపటం లేదు. మరమ్మత్తులకు అత్యధిక నిధులు వెచ్చిస్తున్నప్పటికి నిత్యం గాజువాకలో ఏదో ఒక ప్రాంతంలో పైప్‌లైన్‌లకు లీకేజీలు ఏర్పడుతున్నాయి. గాజువాకలో చాలా వరకు పైప్‌లైన్‌లు మురుగునీటి కాలువలోనే ఉన్నాయి. మరికొన్ని మురుగునీటి కాలువకు ఆనుకొని ఉన్నాయి. ఇదిలావుండగా త్రాగునీటి పైప్‌లైన్‌లు లీకేజీ సమస్య ఎక్కువగా ఉంది. దీనిపై సిబ్బందికి విషయం తెలిసినప్పటికి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, నాలుగైదు రోజుల తరువాత మరమ్మత్తులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి నీటిపైప్‌లైన్‌లకు మరమ్మత్తులు పటిష్టంగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


87వ వార్డు అప్పికొండ కాలనీలో కాలువలో ఉన్న తాగునీటి పైపు లైన్

చింతలలోవలో మహిళపై వీధి కుక్కల దాడి

» చెవి భాగానికి తీవ్ర గాయం


గాయపడిన మహిళ చెవి భాగం

సింధియా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం చల్లా లక్ష్మి (43) అనే మహిళ చింతలలోవలో గల బంధువుల ఇంటికి వెళ్తుండగా ఒక్కసారిగా పలు కుక్కలు ఆమెపై దాడి చేసి చెవి భాగాన్ని తీవ్రంగా గాయపరిచాయి. కింద పడిపోయిన ఆమె భయంతో పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకోవడంతో శునకాలు పారిపోయాయి. చెవికి తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా గ్రామంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయని పలువురు స్థానికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. లక్ష్మి అనే మహిళ చెవి భాగాన్ని తీవ్రంగా గాయపరిచాయని వివరించారు. అందుకు స్పందించిన ఆయన తక్షణమే వీధి కుక్కల పట్టివేతకు చర్యలు చేపట్టారు. అప్పటికప్పుడు ఎనిమిది శునకాలను సిబ్బంది పట్టుకుని అక్కడ నుంచి తరలించారు.

ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులు పరిశీలన


సీఈ శివప్రసాద్‌రాజుకు పనుల వివరాలు తెలుపుతున్న అధికారులు

పెదగంట్యాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులను చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్‌రాజు, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఇండోర్ స్టేడియం కొంతమేర పాడవ్వడంతో క్రీడాకారులకు, వాకర్లు, స్విమ్మర్లకు అసౌకర్యంగా మారింది. దీనిని దృష్టిలో పెట్టుకుని పార్కు ఆధునీకరణకు రూ.ఎనిమిది కోట్లను జీవీఎంసీ మంజూరు చేయడంతో ఆరు నెలల క్రితం పనులు ప్రారంభించారు. ఈ పనులను శివప్రసాద్‌రాజు పరిశీలించి, త్వరగా పనులు పూర్తిచేసి స్టేడియంను వినియోగంలోనికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. స్విమ్మింగ్‌ఫూల్ పనులను త్వరితంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ ఈఈ ఎంఆర్ఎస్ అప్పారావు, ఏఈ శివ, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమ ప్రమాద బాధితులను పరామర్శించిన గండి బాబ్జీ


పొందుతున్న బాధితున్ని పరామర్శిస్తున్న గండి బాబ్జీ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పరవాడ ఫార్మా పరిశ్రమ బాధితులను బుధవారం రాత్రి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితి గురించి సంబంధిత వైద్యులను ఆయన అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆయన సూచించారు. అలాగే మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో పాటు వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, బి.సన్యాసిరావులు బాధితులను పరామర్శించారు.

ఉక్కు శివాలయంలో లక్ష బిల్వార్చన రేపు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ లోపల గల అతి పురాతన శివాలయంలో ఈ నెల 29న లక్ష బిల్వార్చన పూజను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి యేల్లేటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారికి రుత్వికుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు, చండీ హోమం, శివపార్వతుల కల్యాణం వంటి పూజాది కార్యక్రమాలను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

ప్లాంటుకు పూర్వ వైభవం రావాలని శివపార్వతులకు పూజలు

ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవాన్ని ప్రసాదించాలని కోరుతూ ప్లాంట్ ఆలయంలో గల శివపార్వతులకు ఉక్కు ఉద్యోగులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్ఎంహెచ్‌పీ విభాగం ఉద్యోగులు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడాలని, కర్మాగారానికి అన్ని విధాలా మంచి జరిగేలా చూడాలని, కార్మికులకు మేలు చేకూర్చాలని పూజలు జరిపారు. కార్యక్రమంలో విభాగాధిపతులు హల్దర్, డీఆర్‌జే శ్రీనివాస్, నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, నారాయణరావు, జామినాయుడు, అప్పలరాజు, జనార్ధన్, కమాలాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల 36 గంటల నిరాహార దీక్ష రద్దు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 28న చేపట్టదలచిన 36 గంటల నిరాహార దీక్షను రద్దు చేసినట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో ఉక్కు కార్మికుల నిరాహార దీక్ష చేపట్టాలని తొలుత నిర్ణయించామని, అయితే పీఎం టూర్ రద్దు కావడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం లేదన్నారు. అయితే ఉక్కు పరిరక్షణ కోసం చేపట్టిన పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి: ఎంఈవో

పెదగంట్యాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని, ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలకు ఎవరూ అనుమతించవద్దని పెదంట్యాడ మండల విద్యాశాఖాధికారి కె.రమణాజీ అన్నారు. నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహాల నిషేధం-బాలల ఆరోగ్యం అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువకులకు 25, యువతులకు 21 ఏళ్లు నిండేంత వరకు వివాహాలు చేయడం మంచిది కాదన్నారు. అపరిపక్వ మానసిక స్థితి కలిగిన బాలబాలికలకు వివాహాలు చేయడం వల్ల వారికి అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. అనంతరం పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త వేణుశ్రీ, సచివాలయ మహిళా పోలీస్, పెదగంట్యాడ పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

29న 'స్టాడింగ్' సమావేశం

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 29న నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి 117 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు అందజేశారు. ఈ నెల 22న జరగాల్సిన ఈ సమావేశం స్టాండింగ్ కమిటీసభ్యుల కోరం లేక పోవడంతో వాయిదావేశారు. గతవారం జరగాల్సిన సమావేశం కోసం రూపొందించిన అజెండాపైనే తాజా సమావేశంలో చర్చజరుగుతుందని కార్యదర్శి వివరించారు.

సభ్యులంతా ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలి

పీఏసీఎస్ కార్యదర్శి పి.సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అగనంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ (పీఏసీఎస్) సభ్యులంతా ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి పి.సత్యనారాయణ సూచించారు. స్థానిక సీడబ్లూసీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సొసైటీలో మొత్తం 6,806 మంది రైతులకు సభ్యత్వం ఉందన్నారు. అగనంపూడి, దువ్వాడ ప్రాంతాలకు చెందిన సుమారు 350 మందికి సొసైటీలో సభ్యత్వం ఉందని, వీరంతా త్వరితగతిన తమ ఆధార్ కార్డులను అనుసంధానం చేసుకోవాలని కోరారు. కాగా మృతి చెందిన సభ్యుల వివరాలకు సంబంధించి ఆధార్, డెత్, వారసత్వ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను కుటుంబ సభ్యులు తమ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. అటువంటి వారందరికీ మూలధనం ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, డి.రమేశ్, చిన్నారావు, జి.సూర్యనారాయణ, ఎం.కోటి, వీర అప్పారావు, అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.




ఆటోనగర్‌లోని పలు బ్లాక్‌లో అక్షరాలు కనుమరుగైన చిరునామా బోర్డులు

కానరాని చిరునామాలు!

ఆటోనగర్‌లోని వివిధ పరిశ్రమలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు అంతర్రాష్ట్ర వాహనదారులు

ఆటోనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని వివిధ పరిశ్రమలకు దూర ప్రాంతాల నుంచి ముడిసరకు రవాణా చేస్తున్న వాహనదారులు వాటి చిరునామాలు తెలుసుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనదారులకు ఇక్కడ భాష తెలియక చిరునామాలు తెలుసుకునేందుకు మరింత గందరగోళానికి గురవుతున్నారు. దీంతో తమ వాహనాలను ఆటోనగర్‌లోని బ్లాక్‌ల చుట్టూ తిప్పుతూ... కనిపించే వారినల్లా చిరునామాలను అడుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. కాగా ఆటోనగర్ ఆవిర్భావంలో ఏర్పాటు చేసిన చేసిన సూచిక బోర్డులపై ఉన్న అక్షరాలు కనుమరుగవ్వడంతో తరచూ వాహనదారులు ఇక్కట్ల పాలవుతున్నారు. ఆటోనగర్ ఐలా ముఖద్వారం నుంచి ముఖ్యమైన పరిశ్రమలకు చేరుకునే రహదారుల పక్కన కొత్తగా సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే అందరికీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు. బ్లాక్‌లలోని ప్రధాన కూడళ్ల వద్ద వివిధ పరిశ్రమల చిరునామాలు, ఉత్పత్తి వివరాలు, ఫోన్ నంబర్లతో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారి పనులు చేపట్టాలంటూ ఆందోళన

అగనంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి టోల్‌గేటు వద్ద అసంపూర్తిగా వదిలేసిన రహదారి మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మరమ్మతు పనుల నిమిత్తం రహదారిపై లేయర్ తీసేసి నిర్లక్ష్యంగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు విడిచిపెట్టడం దారుణమన్నారు. ఈ కారణంగా కంకర, ఇసుక రోడ్డుపై పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌ఏఐ స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, కరణం జగదీశ్, కె.సత్యారావు ఎస్.సింహాచలం, జి. అప్పారావు, డి.రమేశ్, ఈశ్వరరావు, నరేశ్, హనిత, కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ర్యాలీ

పెందుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వలంటీర్లు పెందుర్తిలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని పెందుర్తి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అక్కడ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా మాత్రమే తమను గుర్తించాలని, వైసీపీ సేవకులుగా భావించరాదని విజ్ఞప్తి చేశారు.అనంతరం తహసీల్దార్ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

హెల్మెట్లు పంపిణీ

గోపాలపట్నం,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని టీడీపీ నేత పి. మౌర్య సింహ పిలుపునిచ్చారు. గోపాలపట్నంలో టీడీపీ పశ్చిమ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో 89 వార్డు అధ్యక్షుడు బి. విజయ్‌కుమార్ సౌజన్యంతో కూటమి కార్యకర్తలకు బుధవారం హెల్మెట్లు పంపిణీ చేశారు. సుమారు వంద మందికి వీటిని అందించారు.

నేడు మహిళల హక్కులపై సదస్సు

పెందుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మం, మహిళల హక్కులపై గురువారం సదస్సు నిర్వహించనున్నట్టు భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) పెందుర్తి శాఖ కార్యదర్శి అంపావల్లి అన్నపూర్ణ తెలిపారు. సుజాతనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరగనున్న ఈ సదస్సుకు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గా భవాని ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు చెప్పారు.

పోస్టాఫీసు కిటకిట



మల్కాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణాపురంలో ఉన్న పోస్టల్ కార్యాలయం మహిళలతో బుధవారం కిటకిటలాడింది. కేంద్ర ప్రభుత్వం అందించే మహిళ సంక్షేమ పథకాలకు బ్యాంకు అకౌంట్, ఆధార్, ఫోన్ నంబరు తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని అధికారులు చెప్పడం, బుధవారం నుంచి ఈ కార్యక్రమాన్ని స్థానిక పోస్టాఫీసులో చేపట్టడంతో మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరారు. మల్కాపురం, శ్రీహరిపురం, కోరమాండల్ గేటు ఏరియా, ప్రకాశ్ నగర్‌లోని మహిళలు భారీగా తరలివచ్చారు.

సమస్యలపై దృష్టిసారించండి

» జోన్-8 అధికారులతో కమిషనర్ సమీక్ష
» విధుల్లో అలసత్వం వహించిన టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై సంపత్‌కుమార్ ఆగ్రహం


మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

వేపగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జోన్ 8 కార్యాలయం పరిధిలోని 89 నుంచి 98వ వార్డులకు సంబంధించి జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 98వ వార్డులోని గోశాల జంక్షన్ కె. కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. శానిటేషన్, ఇంజనీరింగ్, విద్యుత్, రెవెన్యూ శాఖల వారీగా జోన్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చూపించి సమాధానాలు రాబట్టారు. రహదారుల నిర్మాణంలో సింహాచలం దేవస్థానం, వుడా, ఆర్‌అండ్‌బీ శాఖలు ఏవిధంగా ముందుకు సాగాలన్నది సూచించారు. ఈ సమయంలో ఆయన టౌన్ ప్లానింగ్ సిబ్బంది పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అన్ని జోన్లు కంటే ఈ జోన్‌లో ప్లానింగ్ విభాగం పనితీరు బాగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు ప్లానింగ్ కార్యదర్శులు తమ పరిధిలో ఎటువంటి అక్రమ నిర్మాణాలు జరగడం లేదని చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఆయా సచివాలయాల పరిధిలో మళ్లీ పరిశీలించి, అక్రమ నిర్మాణాల వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే రోడ్డు తక్కువగా ఉందని ప్లాన్ నిరాకరించే కంటే ముందు తన దృష్టికి తీసుకువస్తే వాటిని ఏవిధంగా చేయాలో చెబుతానన్నారు. ప్రతి నిర్మాణదారుడు ప్లాన్ తీసుకొని నిర్మించేలా వారిని ఒప్పించి జీవీఎంసీకి ఆదాయం పెంచాలని చెప్పారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ మీనాకుమారి, డీసీఆర్ ఎస్. శ్రీనివాస్, డీడీఎం దామోదర్, సీసీపీ ప్రభాకర్, డీసీపీ రామ్మోహనరావు, సీఈ శివప్రసాదరావు, యూసీడీ ప్రాజెక్టు అధికారి బి. రమణయ్య, జోనల్ కమిషనర్ కె. హైమావతి, ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, ఈఈ, చిరంజీవి, సూపరింటెండెంట్ పీవీవీఎస్ మూర్తి, సర్వేయర్ కుమార్‌స్వామి పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

హెచ్‌పీసీఎల్‌లో కార్మికుల ఆందోళన


మౌన దీక్ష చేస్తున్న నక్కా లక్ష్మణరావు

మల్కాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు హెచ్‌పీసీఎల్ రఫ్ గేటు వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. దీంతో కర్మాగారంలో పనులు ఆగిపోయాయి. ఈ సందర్భంగా నక్కా లక్ష్మణరావు మాట్లాడుతూ కర్మాగారంలో ఉపాధి కోసమని దాదాపు ఐదు వందల మంది కాంట్రాక్టర్లకు దరఖాస్తులు అందించారని, ఇప్పటి వరకు వారికి ఉపాధి కల్పించలేదన్నారు. కాంట్రాక్టర్లను అడిగితే స్పష్టమైన సమాధానం కూడా ఇవ్వడం లేదన్నారు. అనంతరం ఆయన గేటు వద్ద మౌన దీక్షకు దిగగా కార్మికులు పనులు నిలిపివేసి, ఆయనకు మద్దతుగా నిలిచారు. దీంతో కాంట్రాక్టర్ విషయాన్ని మల్కాపురం పోలీసులకు తెలియజేయడంతో సీఐ విద్యాసాగర్ గేటు వద్దకు చేరుకొని మౌన దీక్ష చేస్తున్న నక్కా లక్ష్మణరావుతో మాట్లాడే ప్రయత్నం చేయగా ఆయన మాట్లాడలేదు. కాంట్రాక్టర్లు, కార్మికులు స్టేషన్‌కు వస్తే చర్చలు జరుపుదామని, కంపెనీ వద్ద ఆందోళన చేయడం వల్ల శాంతిభద్రతలు అదుపు తప్పే ప్రమాదం ఉందని సీఐ చెప్పడంతో లక్ష్మణరావు చర్చలకు అంగీకరించారు. చర్చల్లో లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో అన్నింటిని పరిశీలించి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు.దీనికి కాంట్రాక్టర్లు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు బి. కృష్ణ, మజ్జి మాలినాయుడు, ఆర్ఆర్ రాజు, చంద్రమౌళి, పెద్దాడ భూలోకరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పూజ

వేపగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 93వ వార్డు ఆర్ఆర్‌వీపురం పవర్‌ఆఫీస్ పీఠంలో అయ్యప్ప పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఠం ఏర్పాటు చేసి 25 పూర్తి కావడం, స్వాముల ఇరుముడులు పురస్కరించుకుని గురుస్వామి పార్దును ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుజాతనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వుడా ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సుజాతనగర్, శ్రీనివాసానగర్, హష్మీనగర్, గ్యాస్ గోడౌన్, సత్యనారాయణపురం, క్రాంతి నగర్, వుడా కాలనీ, రైల్వే విహార్, వీరా నగర్, జోగులమ్మ బస్టాప్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.


సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, మహిళలు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

మల్కాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 59వ వార్డు నక్కావానిపాలెం సచివాలయం వద్ద సీపీఐ నాయకులు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయులు మాట్లాడుతూ పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షల మంజూరు చేయాలన్నారు. అనంతరం సచివాలయం అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, గండి అప్పారావు, కామేశ్వరరావు, వెంకట్, కనకేశ్వరరావు, రమణమ్మ, జయ, వరలక్ష్మి, పాల్గొన్నారు.

కొండపై తవ్వకాలతో ప్రాణ భయం


నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్‌నగర్ కాలనీవాసులు

పెందుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వెంకటాద్రి ఘాట్ రోడ్డు నిర్మాణం వల్ల పెద్ద పెద్ద బండరాళ్లు పడుతున్నాయని కొండ దిగువన ఉన్న చినముషిడివాడ అంబేడ్కర్‌నగర్, ఏకలవ్య కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి వారు తవ్వకాలు చేపడుతున్న వాహనాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 8న సుమారు రూ. 78 లక్షలతో వెంకటాద్రి ఘాట్ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. కొండపై రాత్రిపూట భారీ యంత్రాలతో తవ్వకాలు చేపడుతుండడంతో మట్టి చరియలు. రాళ్లు విరిగి పడి దిగువున ఉన్న రెండు కాలనీలపై పడుతున్నాయి. దీంతో ప్రజలు ప్రాణభయంతో భీతిల్లుతున్నారు. బుధవారం రాత్రి కొండపై భారీ యంత్రాలతో పనులు చేపట్టడంతో కొన్ని నివాసాలపై మట్టి చరియలు పడ్డాయి. దీంతో కాలనీవాసులు పనులను అడ్డుకున్నారు. కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా పనులు చేపట్టడంతో ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఈ విషయం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు తెలియడంతో ఆయన రెవెన్యూ సిబ్బంది పంపించి, సర్ది చెప్పడంతో స్థానికులు ఆందోళన విరమించారు

పారిశుధ్య కార్మికుల ఆందోళన

మల్కాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతంలోని (ఏడు వార్డులు) పారిశుధ్య కార్మికులు మల్కాపురం శ్మశనవాటిక వద్ద బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో ఆందోళనకు దిగారు. రెండు గంటల పాటు క్లాప్ వాహనాలను వీధుల్లోకి తీసుకెళ్లకుండా నిలుపుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు జీతాలు పడలేదని, మూడు నెలలు జీతాలు ఇవ్వాల్సి ఉండగా జీవీఎంసీ అధికారులు నెల మాత్రమే ఇచ్చారని చెప్పారు. మిగతా రెండు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక అధికారులు జోక్యం చేసుకుని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, ముందు విధులకు హాజరుకావాలని కోరడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 56, టమాటా 44, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 35, క్యాబేజీ 36, క్యారెట్ 76 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 50, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది), 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 44, కీరదోస 28, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 28, కంద 60, దేముడుచిక్కుడు 62, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బూడిద గుమ్మడికాయ 30, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	220

బహుమతిగా మొక్క

ఇటీవల పెరుగుతున్న సంస్కృతి



(ఎండాడ, ఆంధ్రజ్యోతి)

సందర్భానుసారం వివిధ రకాల బహుమతులు ఇచ్చి, పుచ్చుకోవడం ఆనవాయితీ. బొమ్మలు, చిత్రపటాలు, గడియారాలు, గృహోపకరణాలు బహుమతులుగా ఇవ్వడం రివాజు. ప్రస్తుత తరం వినూత్నంగా ఆలోచించి, వీటి స్థానంలో పర్యావరణానికి దోహదపడే మొక్కలను బహుమతులుగా అందించడం ప్రారంభించింది. ఈ సంస్కృతి ఇటీవల విస్తరిస్తోంది. ఈ బహుమతి మధురానుభూతిని కలిగించడంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి సహకరిస్తుందని చెబుతున్నారు.

- వేడుకల్లో భాగమవుతున్న వైనం
- పర్యావరణానికి మేలు చేసే గ్రీన్ ప్లాంట్స్
- అందుబాటులో బడ్జెట్, ఎకో ఫ్రెండ్లీ మొక్కలు

సంతోషం పంచుకునే సందర్భాల్లో బహుమతులను ఇచ్చి పుచ్చుకోవడం ఆనవాయితీ. సాధారణంగా చాక్లెట్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, గృహోపకరణాలు బహుమతులుగా ఇవ్వడం రివాజు. కాలం మారింది. బహుమతి ఇస్తే తీసుకున్న వారి మోములో చిరునవ్వు కనిపించాలి. వారికి ఉపయోగపడాలి. ఆరోగ్యానికి సహకరించాలి. ఈ కోవలోకే గ్రీన్ విషెస్, గ్రీన్ ఫెస్టివల్ బహుమతులు అందుబాటులోకి వచ్చాయి.



కొత్తగా ఆలోచించాలి

శుభ కార్యక్రమాలు, పుట్టినరోజు వేడుకలు, గృహ ప్రవేశాలు లాంటి సందర్భాల్లో బంధువులు, స్నేహితులు, సహోద్యోగులకు మొక్కలను బహుమతులుగా అందించేందుకు చాలామంది ముందుకువస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ఇవి ఇతోధికంగా తోడ్పాటును అందించడంతో పాటు, బహుమతిని స్వీకరించిన వారిలోనూ కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. సాధారణ మొక్కల నుంచి అరుదైన ప్లాంట్‌లను బహుమతిగా అందిస్తున్నారు. రేపటి పచ్చదనానికి పునాది వేసే క్రమంలో బహుమతిగా మొక్కలను అందించే సంస్కృతి మరింతగా పెరగాల్సి ఉంది.

ఈ మొక్కలను ఇవ్వండి



స్నేక్ ప్లాంట్

బహుమతిగా అందించడానికి స్నేక్ ప్లాంట్ మంచి ఎంపిక. ఇది చాలా అందంగా ఉండడంతో పాటు ఎయిర్ ప్యూరిఫైయర్‌గా పనిచేస్తుంది. పర్యావరణానికి అనుకూలం. బెడ్‌రూమ్‌లో పెంచుకుంటే ఆరోగ్యానికి సహకరిస్తుంది. రాత్రి పూట ఆక్సిజన్‌ను విడుదల చేయడం దీని ప్రత్యేకత. సమయానికి నీరు పోయాల్సిన అవసరం ఉండదు. మట్టిలో తేమ శాతం పూర్తిగా ఆరితేనే నీరు అందించాలి.

ఇలాంటి జాతికి చెందినదే పెపరోమియా, ఇది స్నేహితులకు, సహోద్యోగులకు ఇచ్చేందుకు బాగుంటుంది. ఇల్లు, కార్యాలయంలో పెట్టుకోవడానికి అనుకూలం. ఆకర్షణీయంగా ఉంటుంది. నిర్వహణ సులభం. అందంగా ఉండడంతో పాటు తక్కువ స్థలాన్ని ఆక్రమిస్తుంది.



పెపరోమియా

గార్డెనింగ్ ఇష్టపడే స్నేహితులుంటే వారికి అంథూరియం అనే మొక్కను బహుమతిగా ఇవ్వవచ్చు. దీని నుంచి వచ్చే ఎరుపు రంగు పూల అందం వాతావరణాన్ని ఆహ్లాదంగా మార్చేస్తుంది.



అంథూరియం

ఆరోగ్య పరిరక్షణకు

ప్రస్తుతం ప్రపంచాన్ని కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీనిని అధిగమించేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వాలు పిలుపునిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇలా మొక్కలను బహుమతులుగా అందివ్వడం పర్యావరణానికి మేలు చేస్తుంది. దేశంలో ప్రతి సంవత్సరం 12.5 శాతం మంది ప్రజలు వాయు కాలుష్యంతో మరణిస్తున్నారు. ఐదు సంవత్సరాల తక్కువ వయసున్న పిల్లలు 8.5 శాతం మంది కాలుష్యానికి బలైపోతున్నారని ఎన్విరాన్‌మెంట్ సర్వేలు చెబుతున్నాయి. కాలుష్యం నుంచి తప్పించుకునేందుకు మొక్కల పెంపకం మినహా ప్రత్యామ్నాయం లేదని కూడా సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బహుమతిగా అందించేందుకు వివిధ రకాల ఔషధ గుణాలున్న మొక్కలు మార్కెట్లో లభిస్తున్నాయి.

మరికొన్ని మొక్కలు

ఎయిర్ ప్లాంట్స్ డిజర్ట్ రోజ్, పోనీటెయిల్ పామ్ బిగోనియా, చైనీస్ ఎవర్‌గ్రీన్, మనీ ప్లాంట్, అలోవెరా, జెడ్ ప్లాంట్ వంటి మొక్కలు పెంచుకోవడానికి పెద్దగా శ్రమపడాల్సిన అవసరం ఉండదు. ఏపుగా పెరిగి ఇంటి అందాన్నిపెంచుతాయి. వీటితో పాటు పెద్దగాపెరిగి నీడనిచ్చే చెట్లు ఉంటాయి. వీటినీ బహుమతులుగా ఇవ్వవచ్చు. అటువంటి వాటిలో వేప, నేరేడు, మహువా (ఇప్ప), మామిడి, బూరుగు, అశోక విముఖ్యమైనవి. వీటిని ఓపెన్ ప్లేస్, రహదారుల పక్కన పెంచడానికి అవకాశం ఉంటుంది. ఇటువంటి మొక్కలను కుండీలలో పెట్టి అందంగా ప్యాక్ చేసి వాటికి పక్కనే చాక్లెట్లు వంటివి అలంకరణగా ఉంచి బహుమతులుగా అందిస్తే ఇచ్చిన వారికీ, తీసుకున్న వారికీ ఆనందమే.

వడ్లపూడి ఆస్పత్రిలో రాగూర్ ఫార్మా కార్మికులు

పరామర్శించిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా

గాజువాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడలో గల రాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో అస్వస్థతకు గురైన ఆరుగురిని వడ్లపూడిలోని పవన్‌సాయి ఆస్పత్రికి తరలించారు.



వడ్లపూడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అగనంపూడికి చెందిన జి.శరత్‌కుమార్ (40), అనకాపల్లికి చెందిన ఎ.అనీల్ (24), అప్పికొండకు చెందిన సీహెచ్.రాజారావు (36), వడ్లపూడికి చెందిన ఎన్.భాస్కర్ (23), నాతయ్యపాలేనికి చెందిన బి.వీరబాబు (30), విజయనగరం జిల్లా గుర్లకి చెందిన డి.పాపారావు (33) ఇక్కడ చికిత్స పొందుతున్నారు. వారిని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.



బాధితుడ్ని పరామర్శిస్తున్న అనకాపల్లి కలెక్టర్, ఎస్పీ

షీలానగర్ కిమ్స్‌లో మరికొందరు...

అక్కిరెడ్డిపాలెం: రాగూర్ లేబొరేటరీస్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ సిన్హా పరామర్శించారు. ముగ్గురు కార్మికులను చికిత్స నిమిత్తం తీసుకురాగా, అమిత్‌భాగ్ (23) బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ అమిత్‌భాగ్ మృతి చెందినట్టు అతని కుటుంబానికి సమాచా రం అందించామన్నారు. నష్టపరిహారంపై 'రాగూర్' యాజమాన్యంతో చర్చిస్తున్నామన్నారు. చికిత్స పొందుతున్న ఇద్దరు కార్మికులు కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారన్నారు.

డీనోటిఫికేషన్ చర్యలు వేగవంతం చేయండి

» అధికారులకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశం

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావసరాలకు వీఎంఆర్‌డీఏ సేకరించిన భూముల డీనోటిఫికేషన్ చర్యలు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

కలెక్టరేట్ సమావేశమందిరంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు.22-ఎ భూముల డీనోటిఫికేషన్ పనులు పూర్తిచేయాలన్నారు. విశాఖ పోర్టు ట్రస్ట్ భూసేకరణకు చెందిన డీనోటిఫికేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. రీసర్వే సక్రమంగా చేయని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. హైకోర్టులో ఉన్న కేసుల వివరాలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. సమావేశంలో డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాధుర్, సర్వేశాఖ ఏడీ సూర్యారావు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన బాధ్యతలను నిర్వర్తిస్తాం

» ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ (ఐఐఏ) ప్రతినిధులు

సిరిపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తమ రంగానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన బాధ్యతలను పూర్తిగా నిర్వర్తిస్తామని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ (ఐఐఏ) ప్రతినిధులు స్పష్టం చేశారు. బుధవారం సిరిపురంలోని ఓ హోటల్‌లో ఇండియన్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐఐఏ చైర్మన్ రాజేష్ నాగుల, కార్యదర్శి రామ్‌జీ.ఎ.పూటాడ మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటించిన భవన నియామావళి (బై లాస్) సవరణలను స్వాగతించడంతో పాటు ఆమోద ప్రక్రియలను సులభతరంగా చేయడం, బాధ్యతలను ఖరారు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. మార్గదర్శకాలను సమర్థంగా అమలుచేయడంతో పాటు అనుకూలతలను నిర్ధారించడంలో ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. సమావేశంలో ఐఐఏ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో ఐఐఏ చైర్మన్ రాజేష్, కార్యదర్శి రామ్‌జీ, ఇతర ప్రతినిధులు

టీడీపీలో చేరిన ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు

» కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు గ్రేటర్ 15, 23 వార్డుల కార్పొరేటర్లను సాదరంగా ఆహ్వానించారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వరకూ తమ అనుచరులతో ర్యాలీగా వచ్చిన పదిహేనో వార్డు కార్పొరేటరు అప్పారి శ్రీవిద్య, ఆమె భర్త అప్పారి వెంకట గిరిబాబు, అలాగే 23వ వార్డు కార్పొరేటరు గుడ్ల విజయసాయి, ఆమె భర్త సత్యారెడ్డిలకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు.



కార్పొరేటర్లకు కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

సందడిగా జూనియర్ దళపతి బర్త్‌డే

» జూలో నీటి ఏనుగుకు జన్మదిన వేడుకలు

» సీపీఈ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసిన క్యూరేటర్ మంగమ్మ

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో నీటి ఏనుగు (హిప్పోపోటమస్) జూనియర్ దళపతికి బుధవారం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని సీపీఈ జూనియర్ కళాశాల సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో క్యూరేటర్ మంగమ్మ కళాశాల విద్యార్థులు, సిబ్బంది కూరగాయలతో రూపొందించిన కేక్‌ను కట్ చేసి, నీటి ఏనుగుకు తినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నీటి ఏనుగుకు సీపీఈ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు నెలకు సరిపడా ఆహారాన్ని అందించారన్నారు. ప్రతి ఏటా ఏదో ఒక జంతువు జన్మదిన వేడుకలు నిర్వహిస్తారన్నారు. జూనియర్ దళపతి ఇక్కడే జన్మించిందని యాంఫీబియస్ జాతికి చెందిదని, ఇవి ఉప-సహారా ఆఫ్రికాకు చెందిన పాక్షిక- జల క్షీరదమని వివరించారు. కార్యక్రమంలో సీపీఈ కళాశాల సీఈవో బి.ఆదినారాయణ, ప్రిన్సిపాల్ బలివాడ శ్యామల, జూనియర్ అసిస్టెంట్ క్యూరేటర్ బి.గోపి, అటవీ సెక్షన్ అధికారి బి.భారతి, వెటర్నరీ వైద్యులు పాల్గొన్నారు. విద్యార్థులు నీటి ఏనుగు మాస్క్‌లు ధరించి 'హ్యాపీ బర్త్ డే జూనియర్ దళపతి' అంటూ హంగామా చేశారు.



కేక్ కట్ చేస్తున్న జూ క్యూరేటర్ మంగమ్మ, కళాశాల ప్రతినిధులు



దళపతి (హిప్పోపోటమస్)కు పళ్లు తినిపిస్తున్న దృశ్యం

క్రైం... crime news

లారీని ఢీకొన్న బైక్ : యువకుడి దుర్మరణం

మల్కాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తూ ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన పోర్టు రోడ్డులో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీహరిపురానికి చెందిన బసవసాయి చరణ్ (24) ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్నా డు. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ములగాడ మీదుగా శ్రీహరిపురం వెళ్తుండగా శ్రావణ్ షిప్పింగ్ కార్పొరేషన్ కంపెనీ వద్ద రో డ్డుపక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గాజువాక పోలీసులకు సమాచారమివ్వడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



సాయిచరణ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద కారు ఢీకొనడం తో ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్లపూడి యాదవ వీధికి చెందిన వి.ఉప్మాక (53) స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం విధులకు వెళ తున్న ఉప్మాకను ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద స్టీల్‌ప్లాంట్ అధికారికి చెంది న కారు బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉప్మాక మృతదేహం

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

గోపాలపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న నలుగుర్ని గోపాలపట్నం పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం. కేరళ రాష్ట్రానికి చెందిన కేసీ శ్రీజిత్, ఎం.పప్పచాన్, అజిల్‌జాయ్‌తో పాటు నగరానికి చెందిన వల్లంగి ఆదర్శ్ ఏజెన్సీ నుంచి గంజాయి రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు నార్త్ సింహాచలం రైల్వేక్వార్టర్స్ వద్ద మాటువేసి కారులో గంజాయి తరలిస్తున్న నలుగుర్నీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 20 కిలోల గంజాయి ప్యాకెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తున్నట్టు ఏసీపీ తెలిపారు. వారి ఆస్తులపైనా విచారణ చేస్తామన్నారు. సీఐ సురేశ్, ఎస్ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ ఉన్నారు.

బాలుడిపై లైంగిక వేధింపులు

» వసతిగృహం అటెండర్‌పై పోక్సో కేసు నమోదు

పెందుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడిన హాస్టల్ అటెండర్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఓ బీసీ బాలుర వసతిగృహంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలుడిపై హాస్టల్ అటెండర్ అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు, లైంగిక వేధింపులకు గురిచేశాడు. దీంతో బాలుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేసి, అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

పోలీసుల అదుపులో వీడియో తీసిన నిందితుడు

ఆరిలోవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హనుమంతవాక జంక్షను సమీపంలోని ఓ ఆస్పత్రి మహిళల టాయిలెట్‌లోకి వెళ్లి మహిళ వీడియో తీసిన నిందితుడ్ని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై మంగళవారం రాత్రి ఆస్పత్రి ఏవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు జి.రవికుమార్‌ను నిందితుడిగా గుర్తించినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. బాధిత మహిళ, నిందితుడు రోగుల బంధువులకు సహాయకులుగా వచ్చారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కేంద్ర పథకాలపై నేడు అవగాహన సమావేశం

విశాఖపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య గృహయోజన పథకం ద్వారా సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించేందుకు గురువారం అవగాహన సమావేశం నిర్వహించనున్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన ఆనందపురం మండల కార్యాలయంలో జరగనున్న సమావేశానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని ఈపీడీసీఎల్ జోన్ 3 ఆపరేషన్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరు పోలాకి శ్రీనివాసరావు కోరారు.

'విశాఖ విమానాశ్రయాన్ని కొనసాగించాలి'

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలో నిర్మించే అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకోవడానికి జాతీయ రహదారిపై 12 ఫ్లైఓవర్లు, మెట్రో రైలు అందుబాటులోకి వచ్చే వరకు విశాఖ విమానాశ్రయాన్ని కొనసాగించాలని వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ప్రతినిధి ఓ.నరేశ్‌కుమార్ కోరారు. జూన్, 2026 నుంచి భోగాపురంలో విమానాల రాకపోకలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని, ఈలోగా భోగాపురం వెళ్లే జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. గాజువాక, పరవాడ ఫార్మా, స్టీల్‌ప్లాంటు, అచ్యుతాపురం ప్రాంతాల నుంచి వెళ్లేవారికి ఇబ్బందులు తొలగుతాయన్నారు.